



ESTD : 1999

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

స్టేట్ విజన్
STATE VISION

బుధవారం 09-09-2026 పేజీలు : 16




## కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల తోపులాట ..

బోధన్, సెప్టెంబర్08 (విజన్ ఆంధ్ర) : బోధన్ పట్టణంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకుల తోపులాట తో కొద్ది సేపు ఉద్రిక్తత కొనసాగింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ అంబేద్కర్ చౌరస్తా లో కాంగ్రెస్ నాయకులు దిష్టి బొమ్మ దగ్ధం చేసి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అదే సమయంలో ఆరు గ్యారంటీలు అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చేందుకు చౌరస్తా చేరుకున్నారు. దీంతో ఇరు వర్గాలు ఒకరినొకరు ఎదుట పడి పార్టీలకు, నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. వెంటనే రూరల్ సీఐ విజయ్ బాబు, ఎస్ఐ రాజశేఖర్, హబీబ్ ఖాన్ లు చేరుకుని ఇరువురికి సర్ది చెప్పడంతో వివాదం ముగిసి ప్రశాంతత నెలకొంది.

## గంటల తరపడి వేచి చూసిన సమయానికి బస్సు రాకపాయె

- హుస్నాబాద్ నుండి హనుమకొండ కరీంనగర్ రూట్ లలో రద్దీ ఎక్కువగా ఉన్న సమయాల్లో అదనపు బస్సులు నడపాలి
- బస్సులో 150 నుండి ఆపైన ప్రయాణం చేస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం
- విద్యార్థులు వృద్ధులు మహిళల ఆవేదన మంత్రి పొన్నం ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి
- ప్రయాణికుల ఆవేదనతో హుస్నాబాద్ నుండి విజన్ ఆంధ్ర ప్రత్యేక కథనం

6 పేజీలో...



## మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో గుగ్గిళ్ల వింజపల్లి కాజ్‌వేకు రూ.1.75 కోట్ల నిధులు మంజూరు

**తీరనున్న వాహనదారుల కష్టాలు.. రాకపోకలకు మరింత సౌలభ్యం**

**కాజ్‌వే మంజూరుపై హర్షం వ్యక్తం చేసిన హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు**

14 లో...

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 8: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా మంత్రి పొన్నం ప్రభాకర్ చేస్తున్న నిరంతర కృషికి మరో ఫలితం లభించింది.

## గణేష్ ఉత్సవాల్లో నిబంధనలు తప్పనిసరి

- అనుమతులు తీసుకుని మండపాలు ఏర్పాటు చేసుకోవాలి
- డీజేలకు అనుమతి లేదు.. సీఐ అంజమ్మ



నార్నూర్, సెప్టెంబర్ 08(విజన్ ఆంధ్ర ):గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించుకోవాలని నార్నూర్ సీఐ అంజమ్మ సూచించారు. మంగళవారం మండలంలోని రాజులగూడ సుమన్‌బాయి ఫంక్షన్‌హాల్‌లో గణేష్ ఉత్సవాల నిర్వహణపై శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.

16 పేజీలో...

## మోడ్రన్ స్కూల్‌లో పారిశుద్ధ్య కార్యక్రమం

-పాల్గొన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్.

మహబూబ్ నగర్ : స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మంగళవారం మహబూబ్‌నగర్‌లోని మోడ్రన్ స్కూల్‌లో నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన అక్కడ తొలగించిన చెత్తను స్వయంగా ఎత్తి పరిశుద్య పనుల్లో చురుగ్గా పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించడంతో పాటు పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను తొలగించారు. పరిశుభ్రతను పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని మధుసూదన్ నాయక్ అన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పరిశుభ్రత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచాలని ఆయన సూచించారు. స్వయంగా పారిశుద్ధ్య పనుల్లో పాల్గొని ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.



## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం !

- దూలపల్లి డివిజన్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- గత పదేళ్లలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఆరోపణ
- నిరుపేద కుటుంబాలకు ఉచిత సన్నబియ్యం అందిస్తున్నామని వెల్లడి



కొంపల్లి, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లి సర్కిల్ దూలపల్లి డివిజన్‌లో స్మార్ట్

5 పేజీలో...



## బొబ్బాయిపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలి..

### –డిపో మేనేజర్ కు సర్పంచ్ సంపత్ వినతి

కుకునూరుపల్లి, సెప్టెంబర్ 08, విజన్ ఆంధ్ర : బొబ్బాయిపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామ సర్పంచ్ సంపత్ యాదవ్ కోరారు. ఈ మేరకు మంగళవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, గ్రామ ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బొబ్బాయిపల్లికి ఆర్టీసీ బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని కోరినట్లు వారు పేర్కొన్నారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించి త్వరలో బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న యువకునికి అండగా యాదవ సంఘం

### రూ. 10,000 ఆర్థిక సాయం అందజేత

**అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు మేకల సంపత్ కుమార్ యాదవ్**

మల్హర్, సెప్టెంబర్ 8 విజన్ ఆంధ్ర : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మలహర్రావు మండల యాదవ సంఘం యూత్ అధ్యక్షులు పంచిక మల్లేష్ యాదవ్ కుమారుడు పంచిక ఆకర్ష్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు మేకల్ సంపత్ కుమార్ యాదవ్ మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు. అనంతరం బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం యాదవ సంఘం తరపున రూ. 10,000 ఆర్థిక సాయంతో పాటు పండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా కోశాధికారి పోలవేణి అశోక్ యాదవ్, కాటారం డివిజన్ ప్రధాన కార్యదర్శి బోయిని రాజన్న యాదవ్, కాటారం మండల అధ్యక్షులు గద్దం చంద్రన్న యాదవ్, ఇటవేనా శరత్ యాదవ్, సర్పంచ్ తాళ్లపల్లి స్వామి, వదిన పల్లి బిర్లా అశోక్, సెగ్గం దినేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వైఫల్యాలను,పాలనపై బీఆర్ఎస్ పోరాటం

### - ఇంటింటికి తిరిగి బాకీ కార్డులను పంచుతున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు.

మెదక్ /రేగోడ్ సెప్టెంబర్ 08(విజన్ ఆంధ్ర ): ఎన్నికల సమయంలో 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీల పేరుతో తెలంగాణ ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ... 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి, వెయ్యి రోజులు పూర్తయినా ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోయిందని రేగోడ్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు రాచోటి సుభాష్ అన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆదేశాలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా బాకీ కార్డులను ఇంటింటికి తిరిగి ప్రజలకు క్లుప్తంగా వివరిస్తూ పంపిణీ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు గోపాల క్రిష్ణ ,మండల పార్టీ మాజీ యూత్ అధ్యక్షులు దబ్బుల రాజు, సీనియర్ నాయకులు కృష్ణ యాదవ్ , యువ నాయకులు వినయ్ కుమార్,నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



# అసెంబ్లీ ఆవరణంలో మహిళా శాసనసభ్యులపై జరిగిన దాడికి స్పీకర్ బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామాచేయాలి

**- మహిళలు అంటే ప్రభుత్వానికి లెక్క లేదా...?**

**- ఇది తెలంగాణ శాసన సభనా...? లేక కౌరవసభన..?**

**- మాజీ సర్పంచ్ జంగం మంజుల నాగయ్య స్వామి**

మెదక్ /రేగోడ్ సెప్టెంబర్ 08(విజన్ ఆంధ్ర ):తెలంగాణ రాష్ట్ర వర్షాకాల శాసనసభ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణంలో మహిళా శాసనసభ్యుల పైన జరిగిన దాడి సిగ్గుచేటు,మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్నటువంటి కక్ష సాధింపును తీవ్రంగా ఖండిస్తున్నట్లు రేగోడ్ మండలం సిందోల్ గ్రామ మాజీ సర్పంచ్ జంగం మంజుల నాగయ్య స్వామి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలచేత ఓట్ల ద్వారా గెలిచి ప్రజా సమస్యలను అసెంబ్లీలో వారి గొంతును వినిపించాలని సభ్యులు వస్తుంటే వారిని మగ పోలీసులు అడ్డుకోవడమే కాకుండా అసభ్యకరంగా వారిపై దురుసుగా ప్రవర్తించడం,వస్త్రాలు లాగడం, గొంతు పట్టడం,దాడి చేయించడం చాలా హీనమైన చర్య అని మండిపడ్డారు. వారి పై జరిగిన దాడి తీరును చూస్తుంటే ఇది శాసనసభనా... లేక కౌరవ సభ నా అని అన్నారు. ఈ జరిగిన పరిణామానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ విఫల్యం కనుక తెలంగాణ మహిళ లోకానికి క్షమాపణ చెప్పి తక్షణమే స్పీకర్ పదవికి రాజీనామా చేయాలని సిందోల్ గ్రామ మాజీ సర్పంచ్ జంగం మంజుల నాగయ్య స్వామి డిమాండ్ చేశారు. హైకోర్టు



శాసనసభ ఆవరణలో శాసనసభ్యుల పైన జరిగినటువంటి దాడికి విచారణ చేపట్టి దాడికి కారణమైన వారిపైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి మొట్టికాయలు వేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ దళిత కార్డును వాడుతూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు, మీకు, మీ కాంగ్రెస్ పార్టీకి దళిత కుటుంబాల పైన ప్రేమ ఉంటే మీరు ఎన్నికల్లో మహానుభావుడు అయినటువంటి అంబేద్కర్ పేరు మీద, అంబేద్కర్ అభయ హస్తం ద్వారా ఇస్తామన్నటువంటి 12 లక్షల రూపాయల వెంటనే అమలు చేసే విధంగా ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకొచ్చి,శాసనమండలిలో మాట్లాడాలి. కానీ రాజకీయ లబ్ధి కోసం మీడియా ముందు కాదని అన్నారు. అదేవిధంగా మహిళలకు ఇస్తానటువంటి 2500, స్కూటీలు, తులం బంగారం, గురించి కూడా మాట్లాడి అమలయ్యే విధంగా చూడాలన్నారు. మహిళకు ఇచ్చిన అన్ని హామీలు వెంటనే నెరవేర్చాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

# విద్యార్థులకు హరితహారంపై అవగాహన కల్పించిన చిన్నారులు

చౌటకూర్, సెప్టెంబర్ 08, విజన్ ఆంధ్ర: పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం ప్రాముఖ్యతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు 'గ్రో గ్రీన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనిధి, రితిక, ధృతి, ఎస్తర్ పాల్గొని పాఠశాల విద్యార్థులకు హరితహారం, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని వారు విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.
కార్యక్రమంలో విద్యార్థులు హరితహారం ఉద్దేశ్యం, మొక్కల ప్రాధాన్యత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పొందారు. చిన్న వయసు నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం ద్వారా భవిష్యత్



తరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని కార్యక్రమ నిర్వాహకులు పేర్కొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో సేవల నాణ్యతను మెరుగుపరచాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బు గుప్తా.

మహబూబ్‌నగర్ : జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం, మెరుగైన సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఐ.సి.డి.ఎస్ సూపర్‌వైజర్లు, సి.డి. పి.ఓ లతో ఆమె సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల పనితీరు, పిల్లల హాజరు, కొత్త పిల్లల నమోదు, గర్భిణులు, బాలింతల వివరాలు, ఫేస్ రికగ్నిషన్ నమోదు, టేక్ హోమ్ రేషన్ (౧ఐ=), బాలామృతం పంపిణీ, పిల్లల బరువు, ఎదుగుదల, వారిఆరోగ్య పరిస్థితులతో పాటు తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, భవనాలు, వంటగది వంటి మౌలిక వసతుల కల్పనపై సమీక్షించారు.

అంగన్వాడీ సూపర్‌వైజర్లు, సి.డి. పి.ఓలు క్షేత్రస్థాయి పర్యటనలపై కలెక్టర్ ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రతి సూపర్‌వైజర్ తన పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించి, కేంద్రాల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించాలని స్పష్టం చేశారు. కేవలం



రికార్డుల పరిశీలనకే పరిమితం కాకుండా పిల్లలతో, గర్భిణులు, బాలింతలతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై ఆరా తీయాలని సూచించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, ప్రాక్సీ సిబ్బంది లేదా నకిలీ సిబ్బంది పనిచేస్తున్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, డి.డబ్ల్యు.ఓ జరీనా బేగం, సి.డి.పి.ఓలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



## వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో విద్యార్థుల క్షేత్ర సందర్శన

ముథోల్, సెప్టెంబర్ 08:విజన్ ఆంధ్ర. ముధోల్‌లోని వ్యవసాయ పరిశోధనా కేంద్రాన్ని భైంసాకు చెందిన శ్రీ సరస్వతి శిశు మందిర్ విద్యార్థులు క్షేత్ర సందర్శనలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు డా. ఆకుల దినేష్, డా. కిషోర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మట్టి నమూనాల సేకరణ, నేల పరీక్షల ప్రాముఖ్యత, నేల ఆరోగ్యం, పంటల పెరుగుదలకు అవసరమైన పోషకాలపై అవగాహన కల్పించారు.అలాగే ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో వచ్చే మార్పులు వ్యవసాయంపై చూపే ప్రభావాన్ని శాస్త్రవేత్తలు వివరించారు. వాతావరణ మార్పులను ముందుగానే గుర్తించి రైతులు తగిన వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు.క్షేత్ర సందర్శనలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వ్యవసాయ పరిశోధనలు, మట్టి పరీక్షలు, వాతావరణ ప్రభావాలపై అనేక విషయాలను తెలుసుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు కూడా పాల్గొని విద్యార్థులకు సహకరించారు. విద్యార్థుల్లో వ్యవసాయంపై శాస్త్రీయ అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి క్షేత్ర సందర్శనలు ఎంతో దోహదపడతాయని కార్యక్రమంలో పాల్గొన్న వారు తెలిపారు.

## 20,21 వ వార్డులలో పర్యటించిన మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్



హనుమకొండ జిల్లా పరకాల విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 8 ఉదయం పరకాల పట్టణ మున్సిపల్ పరిధిలోని 20 వ వార్డులో నూతన డ్రైనేజీ,సిసి రోడ్డు పనులను పరిశీలించడం జరిగింది మరియు 21వ వార్డులో చెట్లు మొలిసి చెత్తాచెదారంతో కూడిన ప్లాట్లను పరిశీలించి తగు చర్యల దిశగా అధికారులను ఆదేశించిన మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ గారు.ఇట్టి కార్యక్రమంలో స్థానిక 20వ వార్డు కౌన్సిలర్ పాలకుర్తి శ్రీనివాస్,21 వ వార్డు కౌన్సిలర్ సుధమల్ల రమేష్ గార్లతోపాటుగా మున్సిపల్ కౌన్సిలర్స్ కొయ్యాడా శ్రీనివాస్, బండి శ్రీధర్, మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటరెడ్డి గారు,సమన్వయ కమిటీ సభ్యులు ఏకు విద్యాసాగర్,మేరుగు శ్రీశైలం,బొచ్చు సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో పలువురు ఉపసర్పంచులు

జన్నారం, సెప్టెంబర్ 08 (విజన్ ఆంధ్ర) : అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన జన్నారం మండలం లోని పలువురు ఉపసర్పంచులను పోలీసులు అదుపు లోకి తీసుకున్నారు. ఉప సర్పంచుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు బొట్ల కార్తిక్ ఇచ్చిన అసెంబ్లీ ముట్టడి పిలుపు మేరకు మంగళవారంరోజున మండలంలోని పలు గ్రామాల ఉపసర్పంచులు హైదరాబాద్ బయలుదేరుతున్న సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలలో భాగంగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో భరత్, విష్ణు తదితరులు ఉన్నారు.



# మహిళ నేతలపై జరిగిన అమానుష చర్యకు సీఎం బేసరత్తుగా క్షమాపణ చెప్పాల్సిందే

- నిరసనగా బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో ధర్నా
- దేవుళ్లపై ప్రమాణం చేసి ఇచ్చిన గ్యారంటీలు అమలు చేసేదాకా వదిలి పెట్టే ప్రసక్తే లేదు
- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 8 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో టీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని అమానుష చర్యను ఖండిస్తూ మంగళవారం రోజున స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ హాజరయ్యారు. అంబేద్కర్ చౌరస్తా నుండి మల్లెచెట్టు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మోసపూరిత హామీలు దేవుళ్ళపై ప్రమాణం చేసి ప్రజలకు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీ వారం రోజులపాటు నిరసనలకు పిలుపునిచ్చిందన్నారు. 13 డిక్లరేషన్లు,ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని, వెయ్యి రోజుల పాలనలో కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏ ఒక్క హామీ అమలు చేయకుండాఫెయిల్ అయ్యిందని నిరసన తెలుపడానికి అసెంబ్లీకి బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల టీ షర్టులతో అసెంబ్లీకి వస్తున్న ఎమ్మెల్యేలను అడ్డుకున్నారని దాడి చేశారని మహిళా ఎమ్మెల్యేలు అని చూడకుండా అనుచితంగా ప్రవర్తించారని ఆరోపించారు.అసెంబ్లీ పరిధిలో ఏదైనా ఉంటే స్పీకర్ చూసుకుంటారని ప్రభుత్వానికి అక్కడ ఏం సంబంధం అని ప్రశ్నించారు. మహిళా నేతలపై జరిగిన దాడికి సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాల్సిందేనని, కాంగ్రెస్ సర్కారు దుశ్శాసన పర్వం తెలంగాణ సమాజం సమించే సహించదన్నారు.మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన ప్రభుత్వం మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేయించడం అమానుష చర్యని అన్నారు.ఆసరా పింఛన్లు పెంచలేదని, విద్యార్థులకు స్కూటీలు, కౌలు రైతులకు పదిహేను వేలు, కల్యాణ లక్ష్మీ తులం బంగారం, యూత్ డిక్లరేషన్ లో భాగంగా జాబ్ కార్డులు ఏ ఒక్కటి అమలు కాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు అయ్యేవరకు బిఆర్ఎస్ పార్టీ పోరాడుతూనే ఉంటుందని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ధర్నా కార్యక్రమానికి వెళ్లే ఆశ వర్కర్ల అరెస్టు



జన్నారం, సెప్టెంబర్ 08 (విజన్ ఆంధ్ర) : ధర్నా కార్యక్రమం కోసం వెళ్లే ఆశావర్కర్లను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కొరకు సిఐటియూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిర్వహించే చలో హైదరాబాద్ ధర్నా కార్యక్రమానికి వెళ్లే జన్నారం మండల ఆశ వర్కర్లను ముందస్తు చర్యలో భాగంగా పోలీసులు మంగళవారం రోజున అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు సీనియర్ నాయకులు కూకటి కారు బుచ్చయ్య మాట్లాడుతూ ఆశ వర్కర్లు గత 20 సంవత్సరాల నుండి పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారని అలాంటి వీరికి ఇప్పటికి ఎలాంటి చట్టబద్ధ సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ధర్నా కార్యక్రమానికి వెళ్తుంటే పోలీసులు వారిని అరెస్టు చేసి అడ్డుకోవడం సమంజసం కాదని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆశావర్కర్లకు అనేక హామీలు ఇచ్చి ఏది నెరవేర్చలేదని అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం సైతం హామీలు ఇచ్చి ఇంత కాలం గడిచిన ఏ ఒక్క సమస్య పరిష్కరించలేదని అన్నారు. ఆశావర్కర్లకు అన్ని విధాలా న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో నీరజ, ఆశ వర్కర్లు జి.శైలజ, ఎం లక్ష్మి, టి రాజేశ్వరి, డి. వజ్రమాల, కళావతి, ఆర్ గంగామణి, సుజాత, పి. రమ, కే. సునీత, ఎం. శైలజ, ఎం. భూమక్క, డి. సూర్య తదితరులు ఉన్నారు.

## రాజకీయ నాయకులు ఉన్న నాయకులు. దళితుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

చేగుంట సెప్టెంబర్ 9విజన్ ఆంధ్ర : రెండు సంవత్సరాలు అయిపోయింది ప్రజలు కేసీఆర్ పాలన పక్కకు పెట్టి అధికారం పోతే ప్రజలు మిమ్మల్ని పక్కకు పెడితే గిలగిలా కొట్టుకుంటున్నారు సహనం కోల్పోతున్నారు ప్రెస్టేషన్లో ఉన్నారు అధికారం ఉంటేనే బయటకు వస్తారా కేసీఆర్ ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే ప్రతిపక్ష పాత్ర పోషించకుండా ఫామ్ హౌస్ లో కూర్చుని కుటిల బుద్ధులు కుట్రలు కుతంత్రాలు ఇదే మీ తీరా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు కల్పించిన ఓటు హక్కుకు మీరు ఇచ్చే విలువ ఇదా ప్రజల పక్షాన అసెంబ్లీకి రావద్దా ప్రభుత్వ వైఫల్యం ఉంటే మాట్లాడవద్దా దమ్ముంటే అసెంబ్లీకి రమ్మను కేసీఆర్ గారిని అప్పుడు మీరు మీ చిత్తశుద్ధిని నిరూపించుకోవచ్చు ఇక మీ గురించి కొన్ని విషయాలు దళిత బంధు అనే పథకం పెట్టారు కేసీఆర్ అది దళితుల మీద ప్రేమతో కాదు కేవలం హుజురాబాద్ లో ఈటెల రాజేందర్ గారిని ఓడగొట్టటానికి 58,000 వేల దళిత ఓట్లు అక్కడ ఉన్నాయి అందుకోసం దళిత బంధు పథకం అని తీసుకువచ్చి డ్రామాలు ఆడినాడు సరే తర్వాత రాజేందర్ గారు గెలిచారు ఆ కథ అక్కడికి అయిపోయింది కేసీఆర్ ఫెయిల్ అయ్యాడు తర్వాత దళిత బంధు ఎవరికి ఇచ్చాడు గ్రామానికి ఒకరికి బిఆర్ఎస్ కార్యకర్తకు ఇచ్చారు ఇప్పుడు చెప్పండి నిజంగా అది దళితుల మీద ప్రేమతో ఇచ్చిన పథకమా లేక ఏంటి అనేది మీకే వదిలిపెడుతున్నాను రెండవది డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కచ్చితంగా ఇస్తాను అన్నాడు అల్లుడు వస్తే బిడ్డ వస్తే ఎక్కడ ఉంటారు మేక కోడి ఎక్కడ ఉంటుంది అని కాకమ్మ కథలు చెప్పాడు ఎంతమందికి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చాడు మన మండలంలో ఎన్ని గ్రామాలకు ఇచ్చారు చెప్పండి అదే ఇందిరమ్మ ఇల్లు లేని గ్రామం లేదు ప్రతి గ్రామంలో రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇల్లు ఉన్నది పార్టీలకు అతీతంగా ఇది మీకు మాకు తేడా మీవి మాయమాటలు మావి చేతల్లో చూపెట్టే పనులు మరొకటి కెసిఆర్ రైతు బంధువు అని గొప్పగా చెప్పుకునే మీకు నా సూటి ప్రశ్న గుట్టలకు చెట్లకు బండలకు చెరువులో ఉన్న భూములకు పరిశ్రమలకు వాటి స్థానంలో ఉన్న భూములకు రైతుబంధు ఇచ్చి రాష్ట్రాన్ని ఆర్థికంగా సర్వనాశనం చేసి అప్పులపాలు చేశారు, అదే కాంగ్రెస్ పార్టీ నిజమైన రైతులకు సాగు చేసే రైతులకు సాగు భూములకు మాత్రమే రైతు భరోసా ఇచ్చి రాష్ట్రాన్ని ఆర్థికంగా గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తుంది మరొకటి ఈ రాష్ట్రంలో అర్హులైన వారి అందరికీ రేషన్ కార్డులు ఇచ్చి పేదవారు కూడా మనతో సమానంగా సన్నబియ్యం తినాలని సన్న బియ్యం ఇస్తుంది. గుర్తుపెట్టుకోండి ప్రజలు చాలా గొప్ప వాళ్ళు అన్ని గమనిస్తారు అన్ని గమనిస్తున్నారు టిఆర్ఎస్ 10 సంవత్సరాల ప్రభుత్వంలో చేసిన ఘోరాలు నేరాలు చాలా ఉన్నాయి ఇంకా చెప్తాము మీ చేతుల్లో మహా మేధావులు గొప్ప గొప్ప నాయకులు నిజమైన కార్యకర్తలు చాలా చాలా మోసపోయారు అందరిని మోసం చేయడంలో కల్వకుంట్ల కుటుంబ సభ్యులు ఆస్కార్ అవార్డుకు గ్రహీతలు అనే సత్యం దేశం అంతటా తెలుసు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజలు కోరుకున్న ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు ఉంది.



## పాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టాలి..

### -ఎంపీ రఘునందన్ రావుకి వినతిపత్రం అందజేసిన ఉపసర్పంచ్

కుకునూరుపల్లి, సెప్టెంబర్ 08,విజన్ ఆంధ్ర :మండల పరిధిలోని తిప్పారం గ్రామ ఉపసర్పంచ్ ఈసాల నవీన్ మంగళవారం మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావుని కలిశారు. గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో భవనానికి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ఉపసర్పంచ్ మెదక్ ఎంపీ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈసాల నవీన్ మాట్లాడుతూ విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని తక్షణమే మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ ని కోరినట్లు తెలిపారు. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి, విద్యార్థులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని విజ్ఞప్తి చేశామన్నారు. సమస్యను పరిశీలించిన పార్లమెంట్ సభ్యులు త్వరలో పాఠశాలను సందర్శించి, తగిన చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు ఉపసర్పంచ్ నవీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సదానంద గౌడ్, సాబెర్ తదితరులున్నారు.

## భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి– జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ డెస్క్,సెప్టెంబర్ 08 విజన్ ఆంధ్ర విమానాశ్రయం నిర్మాణ ప్రక్రియలో భాగంగా అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను అత్యంత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో విమానాశ్రయం నిర్మాణ ప్రక్రియపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## ఎమ్మెల్సీ తాత మదును బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ నాయకుల రాస్తారోకో



జన్నారం, సెప్టెంబర్ 08 (విజన్ ఆంధ్ర) : అసెంబ్లీ స్పీకర్ పై తాత మధు చేసిన వాఖ్యలకు గాను వెం టనే ఆయనను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చే స్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాస్తారోకో చేశారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం వినోద్ కుమార్ పై బీఆర్ ఎస్ ఎమ్మెల్సీ తాత మధుసూధన్ చేసిన అనుచిత వ్యా ఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ మంగళవారం రోజున జన్నారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మం దలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు ప్రధా న రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సంద ర్భంగా పార్టీ మండల అధ్యక్షులు నందునాయక్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అంటేనే దళిత వ్య తిరేక పార్టీ అని దళితులు ఉన్నత పదవుల్లో ఉంటే దొరల కండ్లు మండుతున్నాయన్నారు. స్పీకర్ గ డ్డం ప్రసాద్ ను ఉద్దేశించి ఎమ్మెల్సీ తాత మధుసూ ధన్ చేసిన వాఖ్యలు తెలంగాణ సమాజానికి సిగ్గు చేటన్నారు. వెంటనే కేసీఆర్ క్షమాపణ చెప్పి ఆయ నపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయ ణ, మండల కార్యదర్శి మాణిక్యం, పట్టణ అధ్యక్షు లు మంద రాజేష్, పొనకల్ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, ఏఎంసి వైఎస్ చైర్మన్ ఫసిఉల్లా, జిల్లా నాయకులుమోహన్ రెడ్డి, ముజాఫర్ అలీ ఖాన్, మామిడిపెల్లి ఇంద్రయ్య, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షులు రియాజోద్దీన్, సర్పంచులఫోరం అధ్యక్షులు కుదిరె వెంకన్న, హేమంత్ చారి, ము త్యం సతీష్, దూమల్ల రమేష్, మచ్చ శంకర య్య, సుధాకర్ నాయక్, నందు నాయక్, అబ్దుల్ ముజ్జు ,దూమల్ల ప్రవీణ్, గంగన్న, పాదం రాకేష్, పాపాగౌడ్, షాకిర్, రాహుల్, గొర్రె మహేష్, పలువురు సర్పం చులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం.. ప్రకటనలకే పరిమితం

**- గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో యథేచ్ఛగా వినియోగం**

**- మాటలకే పరిమితమైన అధికారుల హెచ్చరికలు**

**- ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చే చర్యలు శూన్యం**

గజ్వేల్, 08 సెప్టెంబర్ 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం కేవలం ప్రకటనలకే పరిమితమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత నెలలో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో పట్టణంలో ప్లాస్టిక్ నిషేధిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానా విధిస్తామని బహిరంగంగా ఆర్భాటంగా ప్రకటనలు చేశారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఆ ప్రకటనలు అమలుకు నోచుకోవడం లేదు.

యథేచ్ఛగా విక్రయాలు, వాడకం:

పట్టణంలోని ప్రధాన మార్కెట్, కూరగాయల సంతలు, కిరాణా షాపులు, హోటల్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, స్ట్రాల వినియోగం యథేచ్ఛగా కొనసాగుతోంది. వ్యాపారులు, వినియోగదారులు నిబంధనలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు బహిరంగంగానే దర్శనమిస్తున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

అధికారుల పర్యవేక్షణ కరువు:

ప్రకటన చేసిన సమయంలో కొన్ని రోజులు హడావుడి చేసిన అధికారులు, ఆ తర్వాత తనిఖీలను పూర్తిగా విస్మరించారు. వ్యాపారులకు అవగాహన కల్పించడంలో గానీ, ఆకస్మిక తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించడంలో గానీ అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్లాస్టిక్ రహిత గజ్వేల్ నినాదం కాగితాలకే పరిమితమవుతుందని విమర్శిస్తున్నారు.

పర్యావరణానికి తీవ్ర విఘాతం:

విచ్చలవిడిగా వాడుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు డ్రైనేజీల్లో పేరుకుపోయి మురుగునీరు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. దీనివల్ల దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి, కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను పూర్తిగా అరికట్టేలా కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు, పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఉల్లాస భరితంగా నందికంది చరిత్ర బృందం సదస్సు

విజన్ ఆంధ్ర హైదరాబాద్ (బాల్కొండ ) ఆర్. సి. సెప్టెంబర్ 08 : సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని నందికంది కొత్త తెలంగాణ చరిత్ర ఆధ్వర్యంలో “నందికంది” చారిత్రక యాత్ర కొత్త తెలంగాణ చరిత్ర బృందం నేతృత్వంలో బొమ్మల పల్లకి అవార్డుల కార్యక్రమం ఘనంగా జరిగింది.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన చరిత్రకారులతో ప్రముఖ చరిత్రకారులు స్థపతి డా. ఈమని శివనాగిరెడ్డి “నందికంది” చరిత్రను

విశేషంగా వివరించిన డా. ఈమని శివనాగిరెడ్డి ఆలయనిర్మాణ వైశిష్ట్యం, శిల్పరీతుల ప్రాధాన్యతను కూలంకషంగా వివరిచీన తీరు రాష్ట్ర చరిత్ర కారులకు ఉత్సాహాన్ని ఇచ్చింది. చారిత్రక కట్టడలాను రక్షంచుకోకుంటే భవిష్యత్తులో చారిత్రక ఆనవాళ్ళు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని, ఈ విషయంలో

తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని మనముందు ఉంచి స్ఫూర్తి నింపిన అరవింద్ ఆర్య పకిడే, ఆవేదన వ్యక్తం చేసారు. చారిత్రాత్మక మహోన్నత వైభవాన్నికాపాడుకొనే విధంగా తోడ్పాటు అందిస్తున్న వేదకుమార్, చరిత్ర కారుల సతీదేశాలు , కరుణాకర్ చే పురావస్తు ప్రదర్శన, బొమ్మలపల్లకి వీడియోగ్రఫీ పోటీలో విజేతలకు ప్రతిభాపురస్కారాల ప్రదానం, “కే.టి.సి.బి” సభ్యులకు గుర్తింపు కార్డుల పంపిణీ, జరగటం విశేషం.కొత్త తెలంగాణ చరిత్ర బృందం సృష్టి కర్త శ్రీరామోజు హరగోపాల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 12 వేల గ్రామాలు ఇందులో 2000 గ్రామాల్లో కొత్త తెలంగాణ చరిత్ర



బృందం చరిత్రకారులు 2 వెల గ్రామాలచరిత్రను వెలికి తిస్తుశిడటం విశేషమని “చరిత్ర తెలియని వాడు చరిత్రహీనుడు “ “చరిత్ర తెలిసిన వాడు చరిత్రకారుడు అవుతాడ”ని అన్నారు. నంది కంది సభ ద్వారా లభించిన స్ఫూర్తితో తెలంగాణ ప్రాచీన చరిత్ర అన్వేషణలు మరింత ముందుకు తీసుక వెళ్లే భాగంలో అల్లకొండ ఖిల్లా పరిరక్షణ సమితి కార్యనిర్వాహక అధ్యక్షులు బ్రాహ్మ రౌతు నర్సింగ్ రావు సభలో మాట్లాడుతూ నిజామాబాదు జిల్లాలోని పూర్వ అల్లకొండ ఖిల్లా ఒకప్పుడు దేశంలోనే 2వ రాజధానిగా పేరొందిన ఖిల్లా నేడు శిథిలావస్థలో ఉందని, నేటి “నందికంది” సభ నిర్వహణ ద్వారా స్థానిక ప్రజలకు నందికంది చరిత్ర ఎలా తెలిసిందో అదేవిధంగా కొత్త తెలంగాణ చరిత్ర బృందం తదుపరి సదస్సుని నిజామాబాదు జిల్లా బాల్కొండలో నిర్వహించాలని తెలంగాణ కొత్త చరిత్ర బృందం హరగోపాల్ గారికి విజ్ఞప్తి చేసారు. అనంతరం సభను విజయ వంతంగా నిర్వహించిన శ్రీ రామోజు హరగోపాల్ గారికి,ఆలయ నిర్మాణ విశిష్టతను సవివరంగా తెలిపిన స్థపతి డా,ఈమని శివనాగిరెడ్డి గారికి, సభా నిర్వహణలో ప్రాతినిధ్యం వహించిన ప్రముఖులు శ్రీ చంద్రశేఖర్, శ్రీ వేదకుమార్, ఇతర పరిశోధకులకు, సభ్యులకు, నందికంది గ్రామ సర్పంచ్ దంపతులకు సదస్సు కార్యనిర్వాహక బృందానికి, అహోబిలం కరుణాకర్ గారికి, మతం వినోద్ కుమార్ గారికి, ఆర్థికంగా సహకరించిన వనపర్తి బృందం మరియు కపిలవాయి లింగమూర్తి స్మారక సాహిత్య సంస్థ (వారికుమారుడికి) బస్సు సౌకర్యం, టీ ,స్నాక్స్ సమకూర్చిన “ ఇంటాక్ “ గవర్నింగ్ సభ్యులు, హెరిటేజ్ హైదరాబాద్, దక్కన్ ల్యాండ్ మణికొండ వేదకుమార్,ఆర్థిక సహాయం చేసిన పెద్దలకు,భోజన సదు పాయాలు సమాకూర్చిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా సభ నిర్వాహక కార్యదర్శి కృతజ్ఞతలు తెలిపారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం !



## ముందస్తు అరెస్టులతో నిరసనలను ఆపలేరు

జన్నారం, 08 సెప్టెంబర్ (విజన్ ఆంధ్ర) : ముందస్తు అరెస్టులతో నిరసనలను ఆపలేరని జన్నారం మం డల బీఆర్ ఎస్ నాయకులు అన్నారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం రోజున బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపడుతున్నట్లు తెలుసుకున్న పోలీసులు మండలానికి చెందిన బీఆర్ ఎస్ నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సం దర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కూడా హరించే విధంగా ముందస్తు పోలీసులు అరె స్టులు చేయడం సరైన చర్య కాదని అరెస్టులతో ప్రజా సమస్యలపై ప్రశ్నించే స్వరాలను ఆపలేరని ఈ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపా రు. అరెస్టు అయిన వారిలో జాడి గంగాధర్, ఫజల్ ఖాన్, సూతరి వినయ్, బాలసాని శ్రీనివాస్ గౌడ్, సుశీల, పేరం శ్రీనివాస్, మల్లయ్య, శ్రీనివాస్ రెడ్డి, భూతం శ్రీను, సాయికిరణ్, సాయి, దేవేందర్, తది తరులు ఉన్నారు.

**- దూలపల్లి డివిజన్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**

**- గత పదేళ్లలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఆరోపణ**

**- నిరుపేద కుటుంబాలకు ఉచిత సన్నబియ్యం అందిస్తున్నామని వెల్లడి**

కొంపల్లి, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లి సర్కిల్ దూలపల్లి డివిజన్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు బైరి భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదని ఆరోపించారు. అప్పట్లో రేషన్ కార్డుదారులకు దొడ్డు బియ్యం పంపిణీ చేయడంతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అర్హులైన వారికి నూతన రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు, లబ్ధిదారులకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తోందన్నారు. నిరుపేద కుటుంబాలకు ఉచిత బియ్యం అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని తెలిపారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకుడు బైరి భాస్కర్ గౌడ్, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రాజు, మాజీ ఎంపీటీసీలు మోహన్‌రావు, అశోక్, కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, నాగేశ్వరరావు, వెంకటేష్, గోవర్ధన్ గౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోండి

బోథ్. సెప్టెంబర్ 8. (విజన్ ఆంధ్ర) : బోథ్ గ్రామ పంచాయతీ పరిధిలోని 15వ వార్డులో విద్యుత్ సమస్యను తొలగించాలని కోరుతూ వార్డ్ సభ్యులు షేక్ షాకీర్ విద్యుత్ శాఖ అధికారి చవాన్ జైవంత్ కు మంగళ వారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 వ వార్డులో కరెంట్ స్థంభాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ముఖ్యంగా విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో మంచినీటి సరఫరాకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడి, వార్డు ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని వార్డు సభ్యులు తెలిపారు. సమస్యపై సానుకూలంగా స్పందించి, సమస్య తీవ్రతను గుర్తించి అతి త్వరలో సంబంధిత అధికారులతో మాట్లాడి విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని షేక్ షాకీర్ తెలిపారు.

## జయశంకర్ జిల్లా కేంద్రంలో సీఐ చెన్నూరి శ్రీనివాస్‌కు పెరక సంఘం నాయకుల అభినందనలు

భూపాలపల్లి సెప్టెంబర్ 08 (విజన్ ఆంధ్ర ) భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన చెన్నూరి శ్రీనివాస్‌ను పెరక సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. సీఐగా నూతన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పెరక సంఘం నాయకులు మాట్లాడుతూ.. భూపాలపల్లి పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు పోలీసు శాఖ మరింత చేరువగా పనిచేయాలని ఆకాంక్షించారు. వివిధ వర్గాల ప్రజల సమస్యలను సానుకూలంగా పరిష్కరించడంలో సీఐ శ్రీనివాస్ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. అలాగే పట్టణంలో శాంతియుత వాతావరణం నెలకొనేలా పోలీసు శాఖ చేపడుతున్న చర్యలకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. సీఐ చెన్నూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని, ప్రజలు ఎలాంటి సమస్య ఉన్నా



పోలీసులను సంప్రదించాలని సూచించినట్లు తెలిపారు. ప్రజలు, పోలీసుల మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ మర్యాదపూర్వక భేటీలో భూపాలపల్లి సంఘం అధ్యక్షుడు భారత శ్రీనివాస్, పెరక సంఘం నాయకులు దిడ్డి శ్రీనివాస్, కర్రె రమేష్, పెరక రాజేష్, కరదే సతీష్ పెరక సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడు కార్కూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## డా. బీ ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించిన గండ్ర జ్యోతి..

**1000 రోజుల పాలనలో 6 గ్యారెంటీలు, 420 హామీలు, 3 డిక్లరేషన్లు ఏమయ్యాయి.ప్రజా వేదిక అసెంబ్లీ సాక్షిగా అడ్డుకోవడం దుర్మార్గం.హామీలు అడిగితే పోలీసులతో దాడులా..?మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వ తీరు దారుణం.మహిళా ఎమ్మెల్యేల పట్ల జరిగిన ఘటనలకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్.**

భూపాలపల్లి సెప్టెంబర్ 08 (విజన్ ఆంధ్ర ) కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు,డిక్లరేషన్లలో ఇప్పటి వరకు ఏదీ అమలు కాలేదని,హామీల అమలుపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి సెప్టెంబర్ 2 నుంచి బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఈ చాతగాని ప్రభుత్వం స్పందించకపోవడంతో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించిన వరంగల్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్పర్సన్ ఉ భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి మరియు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు.అనంతరం అంబేద్కర్ సెంటర్ నుండి జయశంకర్ గారి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా ప్రజా సమస్యలను లేవనెత్తేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను,



ఎమ్మెల్సీలను అడ్డుకున్న తీరు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు.ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు హేయమైనచర్య, మహిళా ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వమే వారిపై పోలీసులతో దాడులు చేయించడం ఏమిటని ప్రశ్నించారు.

1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని, ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరుగుతోందని అన్నారు. ఈ వ్యతిరేకతను చూసి ప్రభుత్వం ఫ్రస్ట్రేషన్‌కు గురవుతోందని విమర్శించారు.బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులను కాంగ్రెస్‌లోకి రావాలని ఒత్తిడి చేయడం, రాకపోతే కక్షపూరితంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రజా ప్రతినిధులను గౌరవిస్తూ, అభివృద్ధి కోసం కలిసి పనిచేయాల్సిన ప్రభుత్వం రాజకీయ కక్షలకు పాల్పడటం సరికాదన్నారు.కక్షపూరిత రాజకీయాలు చేసిన వారు ఎక్కువకాలం నిలిచిన చరిత్ర లేదు ప్రజా నాయకులు ప్రజల కోసం పనిచేయాలి అందరినీ ప్రేమ, ఆప్యాయత, గౌరవంతో చూడాలి అని అన్నారు. మహిళా ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి గార్లపై మరియు తదితర ప్రజా ప్రతినిధుల పట్ల వ్యవహరించిన తీరుపై ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.ప్రజల సమస్యల కోసం ప్రశ్నించిన ప్రజా ప్రతినిధులపై జరిగిన ఘటనలకు ప్రభుత్వం బాధ్యత వహించాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి క్షమాపణ చెప్పాలి, లేకపోతే ప్రజాస్వామ్య పద్ధతిలో మా నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తాం అని హెచ్చరించారు.

పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా చట్టం, న్యాయం వైపు నిలబడాలని కోరారు. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు మారుతుంటాయని, కానీ పోలీసులు తమ ఉద్యోగ బాధ్యతలను కొనసాగించాల్సి ఉంటుందని గుర్తుచేశారు.

రాజకీయ పార్టీలు మారుతాయి, ప్రభుత్వాలు మారుతాయి కానీ పోలీసులు తమ ఉద్యోగాల్లోనే ఉంటారు.

కాబట్టి న్యాయం ఎటువైపు ఉంటే అటువైపు నిలబడి విధులు నిర్వర్తించాలి, అతి ఉత్సాహంతో వ్యవహరించడం మంచిది కాదు అని అన్నారు.అధికారం ప్రజలకు సేవ చేయడానికి ఇచ్చిందే తప్ప ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి కాదని మండిపడ్డారు. ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే ప్రభుత్వం సమాధానం చెప్పాలని, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు కూడా సమాన గౌరవం ఇవ్వాలని సూచించారు.మేము చెప్పిందే వేదం, మేము చెప్పిందే జరగాలి అనే ధోరణి ప్రజాస్వామ్యం లో చెల్లదు, అధికారం శాశ్వతం కాదు, రాబోయే రోజుల్లో ప్రజలే తగిన తీర్పు ఇస్తారు అని అన్నారు.



## కైలాస్ టేకిడిలో గురువారం పొలాల పండగ

బోథ్. సెప్టెంబర్ 8. (విజన్ ఆంధ్ర) : తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దుల్లో బోథ్ మండలం నిగిని గ్రామ సమీపాన గల ప్రఖ్యాత శ్రీ శిఖర్ కైలాస్ టేకిడిలో గురువారం పోలాల అమావాస్య పండుగను నిర్వహిస్తున్నట్లు లింబాజీ మహారాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా పొలాల పండగను శ్రావణమాసం నెలరోజుల ఉపవాస దీక్షలో ఉండి ఆఖరి రోజు అయిన అమావాస్య గురువారము రోజున వివిధ గ్రామాల నుండి అలంకరించుకొని వచ్చిన బసవన్నలకు భాజా భజంత్రీలతో స్వాగతించి తోరణాన్ని తెంపి మందిర ప్రదక్షణాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు .బసవన్నల ప్రదక్షణ అనంతరం బసవన్నలకు శ్రీ లింభాజీ మహారాజ్ ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాన్ని బసవన్నలకు సమర్పించి మంగళారతులు ఇచ్చి మంగళాష్టకాలతో అక్షంతలు వేసి దీవెనలు ఇచ్చి మొక్కులు చెల్లించుకుని సాగనంపనున్నటలు ఆయన తెలిపారు.

## కాంగ్రెస్ హామీలను అమలు చేయాలి

మందమర్రి, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర) : అడ్డగోలు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను అమలు చేయాలని మందమర్రి పట్టణ బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహానికి నాయకులు వినతి పత్రాన్ని అందించారు. ప్రశ్నిస్తున్న గొంతుకలను అణిచివేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజాస్వామ్య విలువల పాఠాలు నేర్చుకోవాలని గుర్తు చేశారు. బండారి సూరిబాబు,మేడిపల్లి సంపత్,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పట్టాదారు రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

బోథ్, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): బోథ్ మండల పరిధిలోని బాబెర గ్రామ పంచాయతీలో రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. పట్టాదారు పాసుపుస్తకం కలిగిన ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. ఆధార్ తరహాలో ప్రతి రైతుకు 11 అంకెల ప్రత్యేక రైతు ఐడీ కేటాయించబడుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వ్యవసాయ రంగానికి అందించే పీఎం కిసాన్, పంటల బీమా తదితర పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను ప్రామాణికంగా పరిగణించనున్నట్లు పేర్కొన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ ఫోన్ అవసరమని తెలిపారు. సమీపంలోని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) ద్వారా రైతువేదికలో ఉచితంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్



చేసుకోవచ్చని, లేదా మీసేవ కేంద్రంలో రూ.15 చెల్లించి నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ క్రిష్ణపాల్‌తో పాటు రైతులు రవి, ఇస్రు, రమేష్, సాయి ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు...

# ప్రజా సమస్యలు అడిగితే దాడులా

## మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్

పెద్ద శంకరంపేట్, సెప్టెంబర్ 8: విజన్ ఆంధ్ర: పెద్ద శంకరంపేట: అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులపై జరిగిన పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పెద్ద శంకరంపేటలో ఆయన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేయడం అమానుషమని పేర్కొంటూ, ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రజాప్రతినిధులపై దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు.
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రజా సమస్యల



పరిష్కారం కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు.
ఈ సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మీ రమేష్, బీఆర్ఎస్ నాయకులు సురేష్ గౌడ్, సుభాష్, మాణిక్‌రెడ్డి, బి. దత్తు, వెంకట్‌రెడ్డి, విఠల్‌గౌడ్, యాదుల్ తదితరులు పాల్గొన్నారు.

# గంటల తరపడి వేచి చూసిన సమయానికి బస్సు రాకపాయే

- హుస్నాబాద్ నుండి హనుమకొండ కరీంనగర్ రూట్ లలో రద్దీ ఎక్కువగా ఉన్న సమయాల్లో అదనపు బస్సులు నడపాలి
- బస్సులో 150 నుండి ఆపైన ప్రయాణం చేస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం
- విద్యార్థులు వృద్ధులు మహిళల ఆవేదన మంత్రి పొన్నం ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి
- ప్రయాణికుల ఆవేదనతో హుస్నాబాద్ నుండి విజన్ ఆంధ్ర ప్రత్యేక కథనం

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 8 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ బస్టాండ్ నుండి కరీంనగర్ హనుమకొండ సిద్దిపేట రూట్లలో బస్సులు లేకపోవడం సమయపాలన లేకుండా గంటల తరబడి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు విద్యార్థులు వృద్ధులు మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి హనుమకొండ కరీంనగర్ సిద్దిపేట వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రయాణికులు వైద్య చికిత్స కోసం వెళ్లే వారు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని గంటల తరబడి బస్టాండ్ లోనే ఉండడంతో ఉన్న కాలం ప్రయాణానికి సరిపోతుందని సమయానికి చేరుకోలేకపోతున్నామని పనులు కావడం లేదని వాపోతున్నారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ నుండి ప్రతిరోజు విద్యార్థులు హుస్నాబాద్ ముల్కనూర్ ఎల్కతుర్తి ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున హనుమకొండకు వెళ్తారు గంటల కొద్ది వేచి చూసిన బస్సులు రావడం లేదని ఆలస్యంగా వచ్చిన బస్సులో వంద నుంచి 150 మంది ప్రయాణికులు ఎక్కడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బ్యాగులు పుస్తకాలు సైతం ఒత్తిడికి చినిగిపోతున్నాయని, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు మహిళలు నరకం అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల ఒత్తిడి కారణంతో బస్టాప్ ల వద్ద బస్సులు ఆపడం లేదని ముఖ్యంగా హనుమకొండ ఆర్టీసి క్రాస్ రోడ్ వద్ద విద్యార్థులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుందని బస్సులు ఆపడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సమస్యకు ప్రధాన కారణం సిద్దిపేట హనుమకొండ ప్రధాన రూట్లో హనుమకొండ సిద్దిపేట డిపోలో చెందిన బస్సులు మాత్రమే నడుస్తున్నాయి దీంతో సరిపడా బస్సులు నడవకపోవడంతో హుస్నాబాద్ నుంచి వెళ్లే ప్రయాణికులు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు హుస్నాబాద్ డిపో నుంచి కూడా ప్రతి అర్ధగంటకు ఒక బస్సు నడపాలని ప్రయాణికులు డిమాండ్




చేస్తున్నారు. హుస్నాబాద్ కు రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్న ఏమి ఉపయోగం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.రవాణా శాఖ మంత్రి ప్రతినిత్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రమైన హుస్నాబాద్ లోనే ఇలాంటి పరిస్థితి ఉంటే ఎట్లా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. హుస్నాబాద్ నుండి కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో కూడా బస్సులు నిలుపుదల చేశారని నియోజకవర్గంలోని అన్ని రూట్లలో బస్సులు నడపాలని ప్రజలు కోరుతున్నారు.మహిళలు ఉచిత బస్సు ప్రయాణం ఉండడంతో ప్రయాణికుల సంఖ్య పెరగడం, ప్రయాణికులకు సరిపడా బస్సులు లేకుండా అరకొర బస్సులు ఉండడంతో కారణం, అధికారులు సరైన ప్రణాళికతో ప్రయాణికులు ముఖ్యంగా విద్యార్థులు వెళ్లే ఉదయం సాయంత్రం రద్దీ ఎక్కువ ఉండే సమయాల్లో అదనపు బస్సులు నడపాలని ప్రతి బస్టాప్ లో ముఖ్యంగా హనుమకొండ యూనివర్సిటీ క్రాస్ రోడ్ వద్ద హుస్నాబాద్ కు చెందిన ఎక్కువ మంది విద్యార్థులు వేచి చూస్తారని, బస్సులు నిలపాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.సరిపడ బస్సులు లేకపోవడంతో ఒకే బస్సులో 150 నుంచి ఆపైన ప్రయాణికులు ఎక్కడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కరీంనగర్ హనుమకొండ రూట్ లో బస్సుల సంఖ్య పెంచాలని ఆర్టీసీ సిబ్బంది కూడా అధికారులను మంత్రిని కోరుతున్నారు.



## నందిగామలో భగ్గుమన్న బిఆర్ఎస్

### - కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సిఎం రేవంత్ రెడ్డి,ఎమ్మెల్యే శంకర్ దిష్టిబొమ్మ దగ్ధం.

నందిగామ:సెప్టెంబర్ 08(విజన్ ఆంధ్ర న్యూస్); తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాన్ని అంకితం చేసి,ప్రత్యేక రాష్ట్రం కోసం కోట్లాది తెలంగాణ ప్రజలను ఏకం చేసిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసినట్లు ఆరోపిస్తున్న అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం షాద్ నగర్ నియోజకవర్గం నందిగామ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై స్థానిక బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఎర్రగారి స్వామి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొని సీఎం రేవంత్ రెడ్డి,ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దిష్టి బొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఈట గణేష్,వార్డుసభ్యులు దార సురేష్,కొమ్ము వెంకటయ్య,సారా శ్రీనివాస్ గౌడ్,తుప్పుడు నర్సింహ,బొర్రా ప్రభాకర్ రెడ్డి,మొద్దు నర్సింహ,ఎర్రగారి కృష్ణ,వడ్ల వెంకటేష్,చాకలి సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మారెడ్డిగూడెం ఆశ్రమ పాఠశాలలో ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ



చౌటకూర్, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర ):- చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెంలోని బాలుర ఆశ్రమ పాఠశాలను ఎంపీడీవో కే. శంకర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించిన ఆయన నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ భవానిని సూచించారు.అనంతరం ఎంపీడీవో శంకర్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బొమ్మారెడ్డిగూడెం సర్పంచ్ జైపాల్ నాయక్, పంచాయతీ కార్యదర్శి అలేఖ్య, పాఠశాల ప్రిన్సిపాల్ భవాని తదితరులు పాల్గొన్నారు.

## జేఎన్టీయూహెచ్ సుల్తాన్‌పూర్‌లో ఆటోక్యాడ్‌పై రెండు రోజుల శిక్షణ

చౌటకూర్ సెప్టెంబర్ 08 (విజన్ ఆంధ్ర) :- జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సుల్తాన్‌పూర్‌లో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ) విభాగం ఆధ్వర్యంలో 'డిజైన్ ఆఫ్ ఎలక్ట్రికల్ సిస్టమ్స్ యూజింగ్ ఆటోక్యాడ్' అంశంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళ, బుధవారాల్లో (సెప్టెంబర్ 8, 9) నిర్వహిస్తున్నారు.

నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్ఎస్ఐసీ), హైదరాబాద్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ సిస్టమ్స్ డిజైన్‌లో ఆటోక్యాడ్ వినియోగం, ప్రాక్టికల్ డిజైన్ విధానాలు, పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలపై విద్యార్థులకు నిపుణులు శిక్షణ అందిస్తున్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. విశ్వనాథ రాజు మాట్లాడుతూ, ఆటోక్యాడ్‌పై ప్రాక్టికల్ పరిజ్ఞానంతో పాటు ఎలక్ట్రికల్ డిజైన్ నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఈ శిక్షణ కార్యక్రమం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డా. వై. రాఘవేందర్ రావు మాట్లాడుతూ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని



అన్నారు. ఈఈఈ విభాగాధిపతి అసోసియేట్ ప్రొఫెసర్ వి.బి. శాలిని మాట్లాడుతూ, ఎలక్ట్రికల్ సిస్టమ్స్ డిజైన్‌లో ఆటోక్యాడ్ సాఫ్ట్‌వేర్‌ను సమర్థవంతంగా వినియోగించడంతో పాటు ప్రాక్టికల్ డిజైన్ నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఐసీ హైదరాబాద్ మేనేజర్ డా. టి. ముత్తుకుమారన్, ఎన్ఎస్ఐసీ హైదరాబాద్ సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ (ఈక్యాడ్) శ్రీ రాబిన్ జేమ్స్ శిక్షణ నిపుణులుగా పాల్గొంటున్నారు. ఈఈఈ విభాగాధిపతి అసోసియేట్ ప్రొఫెసర్ వి.బి. శాలిని కన్వీనర్‌గా, బి. ప్రేమ్ కుమార్, వై. అర్చన కోఆర్డినేటర్లుగా వ్యవహరిస్తున్నారు.

## రైతులు, విద్యార్థుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన బీజేపీ

నంగునూరు మండలం, సెప్టెంబర్ 08 విజన్ ఆంధ్ర : రైతులకు అరకొరగా విద్యుత్ సరఫరా చేయడం, రైతుల భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా అందించకపోవడంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ నాయకులు తీవ్రంగా విమర్శించారు. నంగునూరు మండల బీజేపీ అధ్యక్షుడు చౌడేచర్ల వెంకటరామిరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు వల్లపు రెడ్డి రజినీకర్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కనీసం కాల్వల ద్వారా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రైతులకు సరిపడా విద్యుత్ సరఫరా చేయడంతో పాటు 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన రైతుల భూముల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాన్ని కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని రజినీకర్ రెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు ఆధ్వర్యంలో 22ఏ భూములు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలపై ఆందోళనలు నిర్వహిస్తున్నప్పటికీ, ఈ



అంశాలు ప్రజల్లోకి వెళ్లకుండా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పరస్పరం రాజకీయాలు చేస్తున్నాయంటూ ఆయన విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యవహరించిన తీరుపై కూడా ఆయన తీవ్రంగా స్పందించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ప్రతిపక్ష నాయకులు సభ వెలుపల అనుచితంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేలు ఉన్న సమయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు టీషర్ట్ విప్పిన ఘటన సభ్య సమాజానికి ఎలాంటి సందేశం ఇస్తుందని ప్రశ్నించారు. స్పీకర్‌ను కూడా అనుచిత పదజాలంతో విమర్శించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు తగదని పేర్కొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని కాపాడండి..

- అంబేద్కర్‌కు బీఆర్ఎస్ నేతల వినతి
- ప్రతిపక్ష గొంతు నొక్కడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం
- ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం
- ప్రశ్నించే నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గం
- ప్రజల హక్కులను కాపాడాలని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

దుండిగల్, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): ప్రజాస్వామ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ విప్ కేపీ వివేకానంద సూచనలతో చేపట్టిన ఏడు రోజుల కార్యక్రమాల్లో భాగంగా దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట్ డివిజన్ మల్లంపేటలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంభీపూర్ క్రిష్ణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులను పోలీసుల ద్వారా అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ప్రజలకు నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం కల్పించిందని, ఆ హక్కులను పరిరక్షించాలని బాబాసాహెబ్ అంబేద్కర్‌ను కోరుతూ వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

### ప్రశ్నించే గొంతులను అణచివేయొద్దు

ప్రభుత్వ విధానాలను ప్రశ్నించేందుకు అసెంబ్లీ వద్దకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అరెస్టు చేయడం దుర్మార్గమని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. మరుసటి రోజు కూడా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అసెంబ్లీకి వెళ్లకుండా అరెస్టులు చేయడం మరింత దారుణమని ఆరోపించారు. ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష గొంతులను అణచివేయకుండా ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### హామీల అమలుకు డిమాండ్

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే



అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా స్పందించి, నిరసన తెలిపే హక్కును గౌరవించాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షానికి ఉన్న హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు బెంబడి బుచ్చిరెడ్డి, అనంత స్వామి, ఎల్లుగారి సత్యనారాయణ, వార్డు అధ్యక్షుడు గండిగూడెం రమేష్, నాయకులు సగ్గిడి శ్రీనివాస్, మాదాస్ నవీన్, ఆకుల బాబు, వేణుగౌడ్, బైండ్ల గోపాల్, గండిగూడెం నరసింహ, శ్రీనివాస్‌రెడ్డి, కుంట్ల నందు, కోటేష్, రాము, సద్దాం, యువ నాయకులు విష్ణు, వరాల రామ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మధు దిష్టి బొమ్మ దగ్ధం...



బోధన్, సెప్టెంబర్ 08(విజన్ ఆంధ్ర) : స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం బోధన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా లో దిష్టి బొమ్మ దహనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఒక దళిత స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు దురదృష్టకరమన్నారు. వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దళితులను అవమానిస్తూ డా.బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి బోధన్ బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం ఇవ్వడం పట్ల మండిపడ్డారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు దాము, నాగేశ్వర్ రావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పాషా, కౌన్సిలర్లు ఆదినారాయణ, మీర్ గౌస్, జహీర్, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నవీన్, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. తాతా మధుపై చర్యలు తీసుకోవాలి

## ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం డిమాండ్

భీమదేవరపల్లి: సెప్టెంబర్ 8 (విజిల్ ఆంధ్ర) : తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఆయనపై సమగ్ర విచారణ జరిపి, వర్తించే చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నత గౌరవం కలిగిన స్పీకర్ పదవిని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. దళిత సమాజానికి చెందిన స్పీకర్‌ను ఉద్దేశించి అవమానకర వ్యాఖ్యలు చేయడం ద్వారా దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినట్లుగా భావిస్తున్నామని తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం తదితర వర్తించే చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. తాతా మధుతో కలిసి వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నవీన్ రెడ్డిపై కూడా విచారణ జరిపి,




తప్పు నిర్ధారణ అయితే శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, దళిత సమాజం మనోభావాలను దెబ్బతీసినందుకు ఎమ్మెల్సీ తాతా మధు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, ప్రజాప్రతినిధిగా కొనసాగేందుకు అవసరమైన నైతిక ప్రమాణాలపై కూడా సంబంధిత అధికారులు పరిశీలించి, అవసరమైతే ఆయన ఎమ్మెల్సీ సభ్యత్వంపై చర్యలు తీసుకోవాలని చెప్యాల ప్రకాష్ కోరారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రతిపాదించిన సమానత్వం, సామాజిక న్యాయం, గౌరవం వంటి రాజ్యాంగ విలువలను ప్రతి ప్రజాప్రతినిధి కాపాడాల్సిన బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు బొల్లంపల్లి రాజయ్య, కొయ్యడ రమేష్, గంగారపు రవి, ఎండ్లూరి సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఆర్టీ వర్క్‌బుక్ రూపకల్పనలో జిల్లా ఉపాధ్యాయుడికి చోటు

బోథ్. సెప్టెంబర్ 8.( విజన్ ఆంధ్ర) ఎస్సీ ఆర్టీ బుక్ రూప కల్పనలో ఆదిలాబాద్ జిల్లా జైనథ్ ఆదర్శ పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న గోస్కుల సత్య నారాయణ కు చోటు దక్కింది. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు, అభ్యసన ప్రక్రియను మరింత సులభతరం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి ఆధ్వర్యంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు వివిధ వర్క్‌బుక్‌లను రూపొందించింది. ఈ వర్క్‌బుక్‌లు విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడంలో, కాన్సెప్ట్‌లపై అవగాహన పెంపొందించడంలో, స్వయం అభ్యసనాన్ని ప్రోత్సహించడంలో కీలకంగా ఉపయోగపడనున్నాయి.విద్యార్థులు పాఠ్యాంశాలను కేవలం కంఠస్థం చేయకుండా, అర్థం చేసుకోవడం, ఆలోచించడం, పరిశీలించడం, అన్వయించడం, సమస్యలను పరిష్కరించడం వంటి అభ్యసన సామర్థ్యాలను పెంపొందించుకునే విధంగా వర్క్‌బుక్‌లను రూపొందించడం జరిగింది. ఈ వర్క్‌బుక్‌ల అభివృద్ధి ప్రక్రియలో ఆదిలాబాద్ జిల్లా తరఫున గోస్కుల సత్యనారాయణ పాల్గొన్నారు. ముఖ్యంగా 6వ, 7వ తరగతుల జనరల్ సైన్స్ వర్క్‌బుక్‌ల అభివృద్ధి, రూపకల్పనలో జిల్లా ప్రతినిధిగా ఆయన తన సేవలను అందించారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండనీయం..

## తాతా మధుసూదన్ దిష్టిబొమ్మ దహనం

నంగునూరు మండలం సెప్టెంబర్ 08 విజన్ ఆంధ్ర అసెంబ్లీ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ నంగునూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మండలంలోని రాంపూర్ ఎక్స్‌రోడ్ వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తాతా మధుసూదన్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్‌పై బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగ పదవులకు, వాటిలో ఉన్న వ్యక్తులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని పేర్కొన్నారు.అసెంబ్లీ వంటి అత్యున్నత ప్రజాస్వామ్య వేదికకు సంబంధించిన అంశాల్లో ప్రజాప్రతినిధులు సంయమనం పాటిస్తూ హుందాగా వ్యవహరించాలని సూచించారు. రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్‌పై ఈ విధంగా వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగించే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని స్పష్టం చేశారు.

తాతా మధుసూదన్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని అసెంబ్లీ



స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాపోల్ రాజ్ బహదూర్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రెటరీ రంగు అశోక్, ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్, ఏఎంసీ డైరెక్టర్లు ఎండీ ఇమ్రాన్, గొట్టం రంగారెడ్డి, తిప్పని రాజేశ్వర్, జీవన్ నాయక్, ప్రభాకర్, చేర్యాల కృష్ణ, పాక్స్ డైరెక్టర్ కరెడ్ల వెంకట్ రెడ్డి, కాటం కనకయ్య, వల్లద్రి రవీందర్ రెడ్డి, పదిరే శ్యామ్ రెడ్డి, పిల్లి మహేష్, బద్రి సంతోష్ రెడ్డి, బోజు రాములు, గడ్డం కరుణాకర్ రెడ్డి, నాయిని సంపత్ రెడ్డి, మాదే మహేష్, జిన్నా సంపత్ రెడ్డితో పాటు నంగునూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ప్రజాప్రతినిధులను అవమానిస్తే సహించం!

- రేవంత్ సర్కార్ తీరుపై కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ మహిళా నేతల ఆగ్రహం
- అసెంబ్లీ గేటు వద్ద మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసుల వ్యవహారశైలిపై నిరసన
- రానున్న ఎన్నికల్లో మహిళలే కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారు: బీఆర్ఎస్ మహిళా నేతలు

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): మహిళా ప్రజాప్రతినిధులను గౌరవించలేని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ మహిళా నాయకులు డిమాండ్ చేశారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల సందర్భంగా సోమవారం అసెంబ్లీకి వస్తున్న బీఆర్ఎస్‌కు చెందిన మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పట్ల ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ చింతల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద మహిళా నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా నాయకులు మాట్లాడుతూ.. 'ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు సముచిత గౌరవం కల్పిస్తున్నాం' అని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. అసెంబ్లీ గేటు వద్ద మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసుల వ్యవహారంపై కనీసం విచారణకు ఆదేశించకపోవడం మహిళలను అవమానించడమేనని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు, వివిధ డిక్లరేషన్ల అమలుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని




ప్రశ్నిస్తారనే భయంతోనే వారిని సభకు రాకుండా అడ్డుకునే ప్రయత్నం జరిగిందని వారు ఆరోపించారు. ప్రజా సమస్యలను ప్రశ్నించే ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల గొంతు నొక్కే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల అనుచితంగా వ్యవహరించడం, వారి వస్త్రాలు, జుట్టు లాగడం వంటి ఘటనలు జరిగాయని ఆరోపిస్తూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి పరిణామాలకు తావుండకూడదని అన్నారు. అసెంబ్లీని కౌరవ సభగా మార్చి 'దుశ్శాసన పర్వానికి' తెరలేపిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో మహిళలు తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, కుట్రపూరిత రాజకీయాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన తీర్పు ఇస్తారని బీఆర్ఎస్ మహిళా నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు, మహిళా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## చౌటకూర్ లో కోతుల బెడదకు చెక్..

**- గ్రామ పంచాయతీ చర్యలు**

**- ఇళ్లలోకి చొరబడుతున్న కోతులు.. చిన్నారులు, స్థానికులపై దాడుల ఆరోపణలు**

**- కోతులను పట్టించే కార్యక్రమం చేపట్టిన గ్రామ పంచాయతీ**

చౌటకూర్, సెప్టెంబర్ 08 (విజన్ ఆంధ్ర ):- చౌటకూర్ మండల కేంద్రంలోని గ్రామంలో గత కొంతకాలంగా కోతుల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్థులకు ఉపశమనం కల్పించేందుకు గ్రామ పంచాయతీ చర్యలు చేపట్టింది. గత మూడు నెలలుగా కోతులు గుంపులుగా గ్రామంలో సంచరిస్తూ ఇళ్లలోకి చొరబడటంతో పాటు చిన్నారులు, స్థానికులపై దాడులకు పాల్పడుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. కోతుల బెడదతో ప్రజలు భయాందోళనకు గురవుతున్న విషయాన్ని గ్రామస్థులు సర్పంచ్ పార్కల రామారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.గ్రామస్థుల సమస్యపై స్పందించిన సర్పంచ్ పార్కల రామారెడ్డి కోతులను పట్టించే సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో మంగళవారం చౌటకూర్ గ్రామంలో కోతులను పట్టించే కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో సంచరిస్తున్న కోతులను పట్టుకునేందుకు సిబ్బంది చర్యలు చేపట్టారు.పట్టుకున్న కోతులను అటవీ శాఖ సూచనలు, నిబంధనల మేరకు సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ పార్కల రామారెడ్డి తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను గ్రామస్థులు గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజల భద్రతకు సంబంధించిన సమస్యలపై గ్రామ పంచాయతీ ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు.కోతుల బెడదను నివారించేందుకు గ్రామ పంచాయతీ స్పందించి చర్యలు చేపట్టడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా గ్రామంలో కోతుల బెడద పునరావృతం కాకుండా సంబంధిత శాఖల సమన్వయంతో శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రామగౌడ్, గ్రామ అధ్యక్షుడు వర్కాల రమేష్, వార్డు సభ్యులు జైపాల్ రెడ్డి, చక్రపాణి, అభిలాష్, గంగారాం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటాపురంలో ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మ దగ్ధం



వెంకటాపురం సెప్టెంబర్ 08 (విజన్ ఆంధ్ర ); బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ మంగళవారం ములుగు జిల్లా, వెంకటాపురం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ శాసనసభ స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సభా గౌరవాన్ని, రాజ్యాంగబద్ధమైన పదవిని అవమానించేలా మాట్లాడిన వ్యక్తిపై కఠిన చర్యలుతీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. దళిత సామాజిక వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్ రావు పై ఇంతటి నోటి దురుసుతోమాట్లాడటం తాతా మధు అహంకారానికి పరాకాష్ట అని మండిపడ్డారు. దళితుల ఆత్మగౌరవాన్ని గౌరవించకుండా అవమానకరంగా మాట్లాడే వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. తాతా మధూ.. దళిత నాయకుడి పై నోరు పారేసుకుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరు. స్పీకర్ పదవిని అవమానించినందుకు తక్షణమే క్షమాపణ చెప్పాలి. శాసనసభ గౌరవాన్ని కాపాడేందుకు వెంటనే సస్పెండ్ చేయాలి" అని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎ ఎస్ పార్టీ అధికారాన్నికోల్పోయినా అహంకారం మాత్రం ఇంకా పోలేదని, పదవి పోయినబాధతో రాజ్యాంగబద్ధమైన పదవులపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం వారి రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. స్పీకర్ పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పే వరకు తాతా మధు ను వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తాతా మధు పై కఠిన చర్యలు తీసుకునే వరకు కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు. స్పీకర్ గౌరవం అంటే రాజ్యాంగ గౌరవం.. దళితుల ఆత్మగౌరవం అంటే తెలంగాణ ఆత్మగౌరవం. దానిని అవమానించే తాతా మధు ను వెంటనే సస్పెండ్ చేయాల్సిందే! అని కాంగ్రెస్ నాయకులు నినదించారు. ఈ కార్యక్రమంలో పిఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన్ రావు, మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, నాయకులు చిడెం శివ,మన్యం సునీల్, యువజన విభాగం అధ్యక్షుడు చిట్టెం సాయి,పల్మాటి ప్రకాష్, మాజీ జెడ్పీటీసీ పాయం రమణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిట్యాల సాగర్,గాంధర్ల నాగేశ్వరరావు,రావుల నాని, రామక్రిష్ణ, కిరణ్, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం: బత్తుల సుదర్శన్



బెల్లంపల్లి సెప్టెంబర్ 08 విజన్ ఆంధ్ర : బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఇళ్ల వద్దే ముందస్తుగా అరెస్టు చేయడాన్ని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ తీవ్రంగా ఖండించారు. ఎలాంటి నోటీసులు, కారణాలు వెల్లడించకుండా అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా? ప్రజల తరఫున గొంతెత్తితే కేసులు పెడతారా? అని ప్రశ్నించారు. పోలీసులను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజాక్షేత్రంలో మరింత బలంగా సమాధానం చెబుతామని హెచ్చరించారు. అరెస్టులతో తమ పోరాటాన్ని ఆపలేరని, అక్రమ అరెస్టులు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ముందస్తుగా అరెస్టయిన వారిలో మ్జజీ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, పట్టణ అధ్యక్షుడు నూనెటి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి విజయ్, సుందర్‌రావు, కౌన్సిలర్ ఆసాది మధు, ఈట రాకేష్, పట్టణ యూత్ అధ్యక్షులు సబ్బని అరుణ్, గోలి శివ,మద్దెల గోపి, చరణ్, మాజీ కౌన్సిలర్ రాజులాల్ యాదవ్, , ఎలిగేటి శ్రీనివాస్, కేంశెట్టి శ్రీనివాస్, ధర్మేందర్, అరుణ్ తదితరులు ఉన్నారు.

# హామీల అమలేది.. రాజ్యాంగ పరిరక్షణేదీ?

**? రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ శ్రేణుల తీవ్రస్థాయి ధ్వజం**

**? 420 హామీలు.. 13 డిక్లరేషన్లు.. ఆరు గ్యారంటీలపై నిలదీత**

**? ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అణచివేతకు పాల్పడుతున్నారని ఆరోపణ**

**? అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం.. చింతల్ నుంచి అంబేద్కర్‌నగర్ వరకు ర్యాలీ**

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా విమర్శించాయి. 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను ఆకట్టుకుని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం.. హామీల అమలులో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించాయి. ప్రజల హక్కులను, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేలా ప్రభుత్వం పనిచేయాలని కోరుతూ కుత్బుల్లాపూర్ డివిజన్ అంబేద్కర్‌నగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 33 నెలలు గడిచినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో అనేకం ఇంకా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. దీంతో రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు.



రైతుల నుంచి నిరుద్యోగుల వరకు..

రైతులకు పెట్టుబడి సాయం, రైతు భరోసా, కౌలు రైతులకు రైతు భరోసా, నిరుద్యోగులకు ఉద్యోగాలు, విద్యార్థులకు విద్యా భరోసా, పెండింగ్ ఫీజు బకాయిల చెల్లింపు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల పింఛన్ల పెంపు వంటి హామీలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.

ప్రశ్నిస్తే.. ఎదురుదాడా?

ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అసెంబ్లీ వేదికగా ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం.. సమస్యలను పక్కదారి పట్టించేలా వ్యవహరిస్తోందని నాయకులు ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను అవమానించే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ప్రతిపక్షంగా తమ బాధ్యత అని పేర్కొన్న వారు.. ప్రశ్నించే గొంతులను పోలీసుల ద్వారా అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.

రాజ్యాంగాన్ని గౌరవించాలి

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రజలకు అనేక హక్కులను కల్పించిందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తూ ప్రజల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పాలన సాగిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలను సమర్థంగా అందించేలా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి అంబేద్కర్ మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుతున్నామని తెలిపారు.

ర్యాలీగా.. వినతిపత్రంతో

అంతకుముందు చింతల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్‌నగర్ వరకు పార్టీ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్‌ను స్మరిస్తూ రాజ్యాంగ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలని నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# హామీల అమలు లో కాంగ్రెస్ విఫలం...

## బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం...

బోధన్, సెప్టెంబర్08 (విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయిందని నిరసన వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ కి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే లను అడ్డుకుని అరెస్టు చేయడం పట్ల మండిపడ్డారు. వెంటనే ఆరు గ్యారంటీలు 420హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి మండల అధ్యక్షులు శ్రీ రామ్, కౌన్సిలర్ ముషీర్ బాబా, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ వారసత్వ పరిరక్షణకు కీలక అడుగు...

- రాష్ట్ర హెరిటేజ్ శాఖ
-యోగ ధారణ ఫౌండేషన్ మధ్య అవగాహన ఒప్పందం...



బోధన్, సెప్టెంబర్ 08(విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్రంలోని చారిత్రక, సాంస్కృతిక, పురావస్తు వారసత్వ సంపదను పరిరక్షించడం, శాస్త్రీయ పద్ధతుల్లో డిజిటల్ డాక్యుమెంటేషన్ చేయడం, ప్రజల్లో వారసత్వ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం, ప్రజా భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర హెరిటేజ్ శాఖ, యోగ ధారణ ఫౌండేషన్ మధ్య కీలక అవగాహన ఒప్పందం సోమవారం కుదిరినట్లు దారణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉదయ్ మహారాజ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, దేవాలయాలు, పురావస్తు ప్రదేశాలు, సాంస్కృతిక వారసత్వ అంశాలు ఇతర వారసత్వ సంపదను గుర్తించడం, వాటి వివరాలను శాస్త్రీయంగా నమోదు చేయడం, డిజిటల్ సాంకేతికతను వినియోగించి భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉండేలా డాక్యుమెంట్ చేయడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారని తెలిపారు.
ప్రభుత్వ మార్గదర్శకత్వం, నిపుణుల సహకారం, ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణ వారసత్వ సంపదకు మరింత సమగ్ర రక్షణ కల్పించడమే ఈ ఎంఓయూ యొక్క ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు.

# కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తా

- ప్రభుత్వ అనుమతులు, నిధుల కోసం అధికారులతో మాట్లాడతా
- ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులకు కూన శ్రీశైలం గౌడ్ హామీ



షాపూర్ నగర్, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): చింతల్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు అవసరమైన ప్రభుత్వ అనుమతులు, నిధుల మంజూరు కోసం తనవంతు కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ హామీ ఇచ్చారు. మంగళవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించిన సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. సంబంధిత రెవెన్యూ అధికారులు, ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి అవసరమైన అనుమతులు, నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పార్సి ప్రకాష్ గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గుప్తా, మండల అధ్యక్షుడు వస శ్రీనివాస్ గుప్తా, చింతల్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ గుప్తా, సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. తాత మధుపై చర్యలు తీసుకోవాలి

- గాదిగూడ మండల కాంగ్రెస్ పార్టీ డిమాండ్



గాదిగూడ, సెప్టెంబర్ 08(విజన్ ఆంధ్ర ): శాసనసభ సమావేశాల సందర్భంగా గౌరవ శాసనసభ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు అనుచిత, అమర్యాదకర వ్యాఖ్యలు చేయడాన్ని గాదిగూడ మండల కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. స్పీకర్ పీఠాన్ని ఉద్దేశించి దురుసుగా మాట్లాడటం రాజ్యాంగ వ్యవస్థను, ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.స్పీకర్ పీఠానికి ఉన్న గౌరవాన్ని కించపరిచేలా మాట్లాడిన తాత మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పీకర్ దళిత, ఆదివాసీ వర్గాలకు చెందిన వ్యక్తి కావడంతో ఆయనపై చేసిన వ్యాఖ్యలు ఆయా వర్గాల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాత మధును వెంటనే ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేసి, సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు గాదిగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సిడాం వామన్, మాజీ అధ్యక్షుడు గెడ్డం పర్శురాం, వైస్ చైర్మన్ సోయం మారుతి, ఉపాధ్యక్షుడు ఆడే గణేష్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు మాడవి భారత్, ఎస్సీ సెల్ నాయకుడు రాజపేట విష్ణు, కిసాన్ సెల్ నాయకుడు కివానులే దావజీ, జనరల్ సెక్రటరీ జబడే సర్పంచ్ అరవింద్ మనోహర్, సోషల్ మీడియా బాధ్యుడు గేడం షెడము, కనక పండురాంగ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పట్టణ ప్రజలు వ్యక్తిగత శుభ్రత పాటించాలి

- హుస్నాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 8: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో పురపాలక సంఘ చైర్ పర్సన్ దండి లక్ష్మి ఆధ్వర్యంలో 7వ వార్డులో సఫాయి అప్నా బీమారీ భగావో కార్యక్రమం మున్సిపల్ అధికారులు నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ వ్యక్తిగత శుభ్రతను పాటించాలని, ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని, పాత టైర్లలో,కుండలలో రంజాన్లలో నీరు నిలవ లేకుండా చూసుకోవాలని, చేతులను పరిశుభ్రంగా కడుకోవాలని, డయేరియా,డెంగ్యూ మలేరియా, టైఫాయిడ్ రోగాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, స్కూల్ పరిసరాలలో రైన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేసుకోవాలని, చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనానికి అందించాలన్నారు.స్వచ్ఛతను పాటించాలని తెలియజేశారు.వార్డులో బ్లీచింగ్ చల్లడం, స్ప్రే చెయ్యడం, డ్రైనేజీలు శుభ్రపరచడం లాంటి కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు కొంద రజిత,పిల్లి తిరుపతి,బోలిశెట్టి రాజు బొల్లి శ్రీనివాస్,బత్తుల స్వరూప,శానిటైజర్ ఇన్స్పెక్టర్ బాలఎల్లం,కో ఆప్షన్ సభ్యులు ఎండి హసన్, ప్రజా ప్రతినిధులు, నాయకులు బూరుగు కిష్టస్వామి, సతీష్, బత్తుల రవీందర్,జవాన్ సారయ్య మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో సింహద్వారం కడప నిర్మాణం



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 8 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలో స్వయంభుశ్రీ మల్లికార్జున స్వామి ఆలయ సింహద్వారం కడప నిర్మాణం గ్రామ సర్పంచ్ రాచపల్లి శ్రీనివాస్, ఉప సర్పంచ్ చెప్యాల శ్రీధర్ మరియు పాలకవర్గం, శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజల సమక్షంలో అంగరంగ వైభవంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి శాంతయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నాంపల్లి శంకరయ్య, చొప్పరి శ్రీనివాస్, నర్మెట్ట కనకయ్య, దేవసాని ప్రశాంత్ రెడ్డి, మౌటం రాధ, మెడబోయిన సరోజన, పంచాయతీ కార్యదర్శి చెక్క వెంకటేశ్వరరావు, దేవాలయ కమిటీ అధ్యక్షులు జగదీశ్వర చారి, కొమ్మెర రవీందర్ రెడ్డి, కంది చంద్రారెడ్డి, మార్క చంద్రయ్య, పాక శ్యాంసుందర్ గౌడ్, దేవసాని నరసింహారెడ్డి, కొమ్మెర నరసింహారెడ్డి, గుర్తురి చంద్రమౌళి, వద్లూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం...

బోధన్, సెప్టెంబర్ 08(విజన్ ఆంధ్ర) : నేడు బుధవారం 11 కేవీ వాటర్ వర్క్స్ ఫీడర్ మెయింటెనెన్స్, ట్రీ కటింగ్ లో భాగంగా బోధన్ పట్టణంలోని వాటర్ వర్క్స్ పంప్ హౌస్, రాకాసిపేట్, శాంతి నగర్, గౌడ్స్ కాలనీ, లయన్స్ క్లబ్ చౌరస్తా, గాంధీ నగర్, లక్ష్మి నగర్ కాలనీ,నుంచి ఘన్ పూర్ ఎక్స్ రోడ్ వరకు గల కాలనీలకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ నాయిని కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## 105 మంది దివ్యాంగ విద్యార్థులకు చేయూత...

### అలింకో ఆధ్వర్యంలో బోధన్‌లో ప్రత్యేక శిబిరం..

బోధన్, సెప్టెంబర్ 08 (విజన్ ఆంధ్ర): దివ్యాంగ విద్యార్థులకు అండగా నిలుస్తూ వారికి అవసరమైన సహాయ ఉపకరణాలను ఉచితంగా అందించేందుకు బోధన్‌లో మంగళవారం అలింకో ఆధ్వర్యంలో ప్రత్యేక గుర్తింపు,నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. బోధన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జెసీ)లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ శిబిరం కొనసాగింది. బోధన్ డివిజన్ పరిధిలోని బోధన్, ఎడపల్లి, రెంజల్, సాలూర, రుద్రూర్, కోటగిరి, పోతంగల్, వర్ని, చందూర్ మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న మొత్తం 105 మంది దివ్యాంగ విద్యార్థులు శిబిరంలో పాల్గొన్నారు. అలింకో నిపుణుల బృందం విద్యార్థులకు వైద్యపరమైన పరిశీలన, నిర్ధారణ నిర్వహించి, వారి వైకల్యం అవసరాలకు అనుగుణంగా అందించాల్సిన సహాయ ఉపకరణాలను గుర్తించింది. విద్యార్థుల అవసరాలను బట్టి వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, వినికిడి పరికరాలు, దృష్టి సంబంధిత సహాయ పరికరాలు తదితర ఉపకరణాలను అందించేందుకు ప్రక్రియ చేపట్టారు. శిబిరంలో శారీరక వైకల్యం, మస్తిష్క పక్షవాతం కలిగిన 38 మంది, వినికిడి సమస్యలు ఉన్న 10 మంది, దృష్టి వైకల్యం ఉన్న 4 మందితో పాటు ఇతర ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి బోధన్ మండల విద్యాశాఖ అధికారి నాగయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి విద్యలో ముందుకు సాగేందుకు అవసరమైన సహకారం అందించడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం ప్రభుత్వ లక్ష్యమనితెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త శ్రీనివాసరావు, అలింకో బృంద సభ్యులు ప్రతుష్ కుమార్ బిస్వాల్, శివకుమార్, నందం, రిసోర్స్ పర్సన్స్ విజయ్, యూసుఫ్ అలీ, స్పెషల్ ఎడ్యుకేటర్ డా.విశ్వనాథ్ మహాజన్, వివిధ మండలాల ప్రత్యేక అవసరాల విద్యార్థుల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎరువుల బుకింగ్.. యాప్‌తోనే

### - రైతులకు విధానం వివరించిన జాడి మహేశ్వర్

బెల్లంపల్లి , సెప్టెంబరు 8 విజన్ ఆంధ్ర : రైతులు యూరియా, డీఏపీ, పొటాష్ తదితర ఎరువులను సులభంగా పొందేందుకు ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను వినియోగించుకోవాలని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, బుచ్చయ్యపల్లి సర్పంచ్ జాడి మహేశ్వర్ సూచించారు.

బెల్లంపల్లి మండలం కన్నాలలోని రైతు వేదికలో మంగళవారం రైతులకు యాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా యాప్‌లో ఎరువుల బుకింగ్ చేసుకునే విధానం, రైతుల వివరాల నమోదు, అవసరమైన ఎరువులను ముందస్తుగా బుక్ చేసుకోవడం తదితర అంశాలను మహేశ్వర్ రైతులకు వివరించారు. ఉమ్మడి అకెనపల్లి గ్రామాలైన అకెనపల్లి, బుచ్చయ్యపల్లి, లింగాపూర్ గ్రామపంచాయతీల పరిధిలో వెంకట ముత్యంరావు భూములు, పీపీ భూముల్లో సాగు చేస్తున్న రైతులు కూడా యాప్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం



అందుబాటులోకి తీసుకొచ్చిన బుకింగ్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యాప్ వినియోగంపై ఏవైనా సందేహాలు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

అధికారుల సూచనలు

కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రేమ్‌కుమార్, ఏఈఓ గౌస్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. రైతులకు ఫెర్టిలైజర్ బుకింగ్ ప్రక్రియ, ఎరువుల వినియోగంపై పలు సూచనలు చేశారు. వివిధ గ్రామాలకు చెందిన రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

నార్నూర్, సెప్టెంబర్ (విజన్ ఆంధ్ర ):ఆధ్యాత్మిక భావనలు, చింతనతోనే మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని ఆధ్యాత్మిక గురువు శ్రీ సుభాష్ మహారాజ్ (హింగోలి, మహారాష్ట్ర) అన్నారు. మండలంలోని రాజులగూడ గ్రామంలో గత ఏడు రోజులుగా కొనసాగిన శ్రీమద్ భాగవత పురాణ కథా సప్తాహం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన మహాపూజ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి శ్రీ సుభాష్ మహారాజ్ మాట్లాడుతూ..ఆధ్యాత్మిక చింతన మనిషిలో ప్రశాంతతను పెంపొందిస్తుందని అన్నారు. నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనేందుకు ఆధ్యాత్మికత దోహదపడుతుందని తెలిపారు. భగవంతుడిపై విశ్వాసంతో పాటు సత్ప్రవర్తన, సేవాభావాన్ని అలవర్చుకోవాలని భక్తులకు సూచించారు.



భక్తిశ్రద్ధలతో మహాపూజ : భాగవత పురాణ కథా సప్తాహం ముగింపు

సందర్భంగా రాజులగూడలో నిర్వహించిన మహాపూజలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో శ్రీ మూర్తి రాములు పీఠాధిపతి శ్రీశ్రీ రామ్ మహారాజ్, నిర్వాహకులు రాథోడ్ సావిందర్, ఉపసర్పంచ్ రాథోడ్ గణేష్, గ్రామస్తులు రాథోడ్ జయవంతరావు, రాథోడ్ గోవిందరావు,రాథోడ్ దిగంబర నాయక్, రాథోడ్ వసంత్, కుమార్ గోవింద్,రాథోడ్ శంకర్, ఆడే శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## తాతా మధు వ్యాఖ్యలను ఖండించిన మాదిగ హక్కుల దండోరా



బెల్లంపల్లి, సెప్టెంబర్ 8 విజన్ ఆంధ్ర : అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు తీవ్రంగా ఖండించారు. తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయనను బీఆర్ఎస్ నుంచి వెంటనే బహిష్కరించాలని కోరారు. ప్రజా సమస్యలను శాసనసభలో చర్చించి పరిష్కరించాల్సిన నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దళిత సమాజం ఐక్యంగా ఉండాలని రాజనర్సు పిలుపునిచ్చారు.

## గిగ్ కార్మికులకు హక్కులివ్వాలి!

? కార్మిక హోదాతో సామాజిక భద్రత కల్పించాలి

? కనీస వేతనం, ఉద్యోగ భద్రతకు చట్టం తేవాలి

? టార్గెట్లు, రేటింగ్‌ల పేరుతో ఒత్తిడి తగ్గించాలి

? ప్రమాద బీమా, వైద్యం, పరిహారం అందించాలి

బాచుపల్లి, సెప్టెంబరు 8 (విజన్ ఆంధ్ర): జొమాటో, స్విగ్గీ, బ్లింకిట్, జెప్టో, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఉబర్, ఓలా, రాపిడో, బిగ్‌బాస్కెట్ తదితర ఆన్‌లైన్ వేదికల ద్వారా సేవలందిస్తున్న గిగ్ కార్మికులకు కార్మిక హోదా కల్పించి, కనీస వేతనం, ఉద్యోగ భద్రతతో పాటు సమగ్ర సామాజిక భద్రత కల్పించాలని సీఐటీయూ మేడ్చల్ జిల్లా వర్కర్ కన్వీనర్ మణికంఠ, జిల్లా కో-కన్వీనర్ రాథోడ్ సంతోష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా లక్షలాది మంది యువత గిగ్ కార్మికులుగా పనిచేస్తూ ప్రజలకు అత్యవసర సేవలు అందిస్తున్నారని తెలిపారు. అయితే వారి శ్రమకు తగిన ఉద్యోగ భద్రత, కనీస వేతనం, సామాజిక భద్రత వంటి హక్కులు



అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. టార్గెట్లు, రేటింగ్‌లు, ఇన్సెంటివ్‌లు, పెనాల్టీల పేరుతో కార్మికులపై ఒత్తిడి పెరుగుతోందని వారు పేర్కొన్నారు. సరైన విచారణ లేకుండానే యాప్ ఖాతాలు, ఐడీలు నిలిపివేయడం లేదా బ్లాక్ చేయడం వల్ల కార్మికులు ఒక్కసారిగా ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. చెల్లింపులు, రేటింగ్ విధానం, పెనాల్టీల విషయంలో పారదర్శకత ఉండాలని డిమాండ్ చేశారు. పని సమయంలో రోడ్డు ప్రమాదాలకు గురయ్యే గిగ్ కార్మికులకు తక్షణ వైద్య సహాయం, ప్రమాద బీమా, తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్, గ్రాట్యుటీ వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. డెలివరీ టార్గెట్ల కోసం వేగంగా ప్రయాణించాల్సిన పరిస్థితులు కార్మికుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా గిగ్ కార్మికుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పని సమయంలో వారి రక్షణకు కంపెనీలు, ప్రభుత్వాలు బాధ్యత వహించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గిగ్ కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే గుర్తించి సమగ్ర చట్టం రూపొందించి కార్మిక హక్కులు, కనీస వేతనాలు, సామాజిక భద్రత కల్పించాలని కోరారు. కంపెనీలు భారీగా లాభాలు ఆర్జిస్తున్నప్పటికీ, ఆ లాభాల వెనుక శ్రమిస్తున్న కార్మికులకు కనీస హక్కులు లేకపోవడం అన్యాయమని వారు పేర్కొన్నారు. "గిగ్ వర్కర్లు కేవలం యాప్ భాగస్వాములు కాదు.. వారు కార్మికులు. వారికి కార్మిక హక్కులు, కనీస వేతనాలు, సామాజిక భద్రత కల్పించాలి" అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ యంగ్ వర్కర్ నాయకులు పి.భాస్కర్, తిరుపతి, శ్రీను, రాంబాబు, పి.స్వామి తదితర కార్మికులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు లైబ్రరీ పుస్తకాల పంపిణీ

**- ఎప్సియన్ సంస్థ, మై భారత్ రంగారెడ్డి, రాజారాం ఫౌండేషన్ సహకారంతో.**

**- గణేష్ యువజన సంఘం ఆధ్వర్యంలో పంపిణీ.**

నందిగామ:సెప్టెంబర్ 08(విజన్ ఆంధ్ర న్యూస్) : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోనకవర్గం నందిగామ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎప్సియన్ సంస్థ,మై భారత్ రంగారెడ్డి,రాజారాం ఫౌండేషన్ సహకారంతో గణేష్ యువజన సంఘం ఆధ్వర్యంలో లైబ్రరీ పుస్తకాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, ప్రముఖుల జీవిత చరిత్రలు,దేశభక్తి,సైన్స్ మరియు టెక్నాలజీ,హిందీ,ఇంగ్లీష్,తెలుగు నవలలు,కథలు తదితర పుస్తకాలను అందజేశారు.విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు జ్ఞానాన్ని మరియు వ్యక్తిత్వ




వికాసాన్ని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని,గణేష్ యూత్ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఈట గణేష్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఉపాధ్యాయులు,మై భారత్ ప్రతినిధి దాసరి శ్రీశైలం,గణేష్ యువజన సంఘం సభ్యులు ఇబ్రహీం,నరేష్,అఖిల్,జగదీష్,అనీల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి !

**- దుండిగల్, బౌరంపేట్ పెద్ద చెరువులను పరిశీలించిన జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్**

**- క్రేన్లు, లైటింగ్, బారికేడింగ్, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి**

**- నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం**

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ పెద్ద చెరువు, బౌరంపేట పెద్ద చెరువులను ఆయన సందర్శించి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జనానికి తరలివచ్చే భక్తులు, వినాయక విగ్రహాల నిర్వాహకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. చెరువుల వద్ద క్రేన్ల ఏర్పాటు, లైటింగ్, బారికేడింగ్, పారిశుద్ధ్య నిర్వహణ తదితర పనుల పురోగతిని పరిశీలించారు. అవసరమైన చోట్ల అదనపు ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.

### గడువులోగా పనులు పూర్తి చేయాలి

నిమజ్జన కార్యక్రమాల సమయంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు ఉండేలా చూడాలని జోనల్ కమిషనర్ సూచించారు. చేపట్టిన పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు నిర్ణీత గడువులోగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను, సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని, నిమజ్జన ప్రదేశాల్లో పారిశుద్ధ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.




### అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు

నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా బారికేడింగ్, అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్‌తో పాటు డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్, డిప్యూటీ ఇంజనీర్ పాపమ్మ, అసిస్టెంట్ ఇంజనీర్లు సురేందర్ నాయక్, అశోక్ కుమార్, ఏఎంసీ లక్ష్మయ్య, సర్కిల్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ధ్వజం..

**- అంబేద్కర్‌కు వినతిపత్రం..**

**- 1000 రోజుల దగా పాలన.. 420 హామీల మోసం!**

బెల్లంపల్లి, సెప్టెంబరు 8 విజన్ ఆంధ్ర..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల పాలన, ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాట కార్యక్రమం మంగళవారం బెల్లంపల్లిలో ముగిసింది.

బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆదేశాల మేరకు అంబేద్కర్ కాంటా చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు.

మహిళలకు నెలకు రూ.2,500, పెన్షన్ల పెంపు, ప్రతి కుటుంబానికి తులం బంగారం, రూ.500కే గ్యాస్ సిలిండర్, విద్యార్థినులకు స్కూటీలు వంటి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని నాయకులు మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా కాలయాపన చేస్తూ ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని, రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, పట్టణ అధ్యక్షుడు నూనెటి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి విజయ్, సుందర్‌రావు, కౌన్సిలర్ ఆసాది మధు, ఈట రాకేష్, పట్టణ యూత్ అధ్యక్షులు సబ్బని అరుణ్, గోలి శివ,మద్దెల గోపి, చరణ్, మాజీ కౌన్సిలర్ రాజులాల్ యాదవ్, , ఎలిగేటి శ్రీనివాస్, కేంశెట్టి శ్రీనివాస్, ధర్మేందర్,సోము, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# అనుమతి ఒకటి.. నిర్మాణం మరొకటి !

**- గాగిలాపూర్‌లో అనధికార అంతస్తుపై అధికారుల కొరడా**

**- ఎస్0 1 అనుమతితో ఎస్0 2 నిర్మాణం.. అదనపు అంతస్తు కూల్చివేత**

**- నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు: డిప్యూటీ కమిషనర్**

దుండిగల్, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): దుండిగల్ సర్కిల్ పరిధిలో అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణంపై అధికారులు చర్యలు చేపట్టారు. గాగిలాపూర్‌లోని చర్చి ప్రాంతంలో ప్లాట్ నంబర్ 51, సర్వే నంబర్ 194లో ఎస్0 1 నిర్మాణానికి అనుమతి తీసుకుని, అదనంగా ఎస్0 2 అంతస్తు నిర్మిస్తున్నట్లు గుర్తించిన టౌన్ ప్లానింగ్ అధికారులు.. అనధికారంగా నిర్మించిన అదనపు అంతస్తును కూల్చివేశారు. ఈ సందర్భంగా దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే ఎలాంటి నిర్మాణాన్నీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. భవన నిర్మాణానికి అనుమతి పొందిన ప్రణాళికకు అనుగుణంగానే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అనుమతులు ఒకలా తీసుకుని, అదనంగా అంతస్తులు నిర్మించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక నిఘా

దుండిగల్ సర్కిల్ పరిధిలో తక్కువ విస్తీర్ణంలో అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు. నిర్మాణాలకు అనుమతులు తీసుకున్నప్పటికీ, ఆమోదిత ప్రణాళికకు విరుద్ధంగా అదనపు అంతస్తులు, ఇతర నిర్మాణాలు చేపడుతున్న వారిని గుర్తిస్తున్నామని పేర్కొన్నారు.

### నిబంధనల ఉల్లంఘనకు చెక్

భవన నిర్మాణ అనుమతుల్లో పేర్కొన్న నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు. నిర్మాణ దశలోనే అక్రమాలను గుర్తించి, వాటిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేలా టౌన్ ప్లానింగ్ సిబ్బంది పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.

### అనధికార నిర్మాణాలపై కూల్చివేతలు

సర్కిల్ పరిధిలో అనధికార నిర్మాణాలను ఎప్పటికప్పుడు గుర్తించి, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ స్పష్టం చేశారు. అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై కూల్చివేతల ప్రక్రియను కొనసాగిస్తామని తెలిపారు. ఈ చర్యల్లో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, టీపీఎస్ ముఖేష్ సింగ్‌తో పాటు టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# విద్యానగర్ లో గణనాథుడికి ఘన ఆగమనం - ఆలయ నిర్మాణ సంకల్పంతో భక్త బృందం

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, సెప్టెంబర్ 08:

కల్వకుర్తి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో వరసిద్ధి వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో మంగళవారం గణనాథుడి ఆగమనం ఘనంగా జరిగింది. కాలనీలో శాశ్వతంగా వినాయక ఆలయం నిర్మించాలనే సంకల్పంతో భక్త బృందం ముందుకు సాగుతోంది. ఆలయ నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రతి సంవత్సరం వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా గణపతి విగ్రహాన్ని డప్పు వాయిద్యాలు, భక్తి కోలాహలం నడుమ మండపానికి తీసుకువచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి లతీఫ్‌కు మద్దతు

భైంసా, సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడు ఎం.ఏ. లతీఫ్ తన పేరును పరిశీలించి కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి సిఫారసు చేయాలని కోరారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే, ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బోస్లే నారాయణరావు పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, చైర్మన్ పదవికి తనకు మద్దతు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బోస్లే నారాయణరావు పాటిల్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి నాయకుడికి అండగా ఉంటానని, లతీఫ్ గతంలో కాంగ్రెస్ పార్టీ కోసం చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని ఆయన పేరును పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎం.ఏ. లతీఫ్, బోస్లే నారాయణరావు పాటిల్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శంకర్ చంద్రే, నారాయణరెడ్డి, ప్రకాష్, అబ్దుల్ వాజిద్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడికి లక్షలాది డప్పులతో సిద్ధం

**- వంటేరు ప్రతాప్ రెడ్డి హెచ్చరిక**



గజ్వేల్/వర్గల్, 08 సెప్టెంబర్ 2026 (విజన్ ఆంధ్ర): తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని, త్వరలోనే వేలాది డప్పులతో ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. హైదరాబాద్-కరీంనగర్ రాజీవ్ రహదారిపై సింగయిపల్లి చౌరస్తా వద్ద నిర్వహించిన మహా ధర్నాలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఫామ్‌హౌస్‌పై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడానికి వెళ్తుంటే, పోలీసులే వారికి ఎస్కార్ట్‌గా వెళ్లడం దుర్మార్గమని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి చౌకబారు చావు రాజకీయాలు మానాలని, దమ్ముంటే కేసీఆర్ చేసిన అభివృద్ధిలో పోటీపడాలని సవాలు విసిరారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం నశించి రాబందుల రాజ్యం నడుస్తోందన్నారు. అక్రమ దాడులను ప్రోత్సహిస్తున్న అసమర్థ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమను అక్రమంగా అరెస్టు చేసి బేగంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. భవిష్యత్తులో గజ్వేల్‌లో కాంగ్రెస్ నాయకులను తిరగనివ్వమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వర్గల్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఎంపీపీలు లతా రమేష్ గౌడ్, బాల్ రెడ్డి, యువజన అధ్యక్షుడు నాగరాజు, బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు కృష్ణారెడ్డి, గంగిశెట్టి రవి, సత్యనారాయణ గౌడ్, బాబుల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డిలతో పాటు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భైంసాలో నేడు ఎస్పీ ప్రజావాణి

ప్రజల ఫిర్యాదులు స్వయంగా స్వీకరించనున్న జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్

భైంసా, సెప్టెంబర్ 8:విజన్ ఆంధ్ర.

నిర్మల్ జిల్లా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ బుధవారం భైంసాలో ప్రజలకు అందుబాటులో ఉ ఒడనున్నారు.

09-09-2026 బుధవారం ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంటల వరకు భైంసా క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వయంగా స్వీకరించనున్నారు. పోలీస్ శాఖకు సంబంధించిన సమస్యలు, ఫిర్యాదులు, వివిధ అంశాలపై ప్రజలు నేరుగా ఎస్పీని కలిసి తమ సమస్యలను వివరించే అవకాశం ఉంటుంది.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి నిబంధనల ప్రకారం సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు పోలీస్ శాఖ తెలిపింది. తమ సమస్యలను నేరుగా జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లాలనుకునే ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని సూచించారు.ప్రజల సమస్యలను నేరుగా వినేందుకు జిల్లా ఎస్పీ భైంసాలో అందుబాటులో ఉండనున్న నేపథ్యంలో, భైంసా పరిసర ప్రాంతాల ప్రజలు తమ ఫిర్యాదులతో హాజరై ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

# !! ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా స్పీకర్ పై ఎమ్మెల్సీల వ్యాఖ్యలు !!

**- ఎమ్మెల్సీలపై శాసన మండలి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.**

**- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దేపల్లి కుమారస్వామి గౌడ్.**

**- స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ నందిగామలో ఎమ్మెల్సీల దిష్టిబొమ్మలు దగ్ధం.**

**- ఎమ్మెల్సీ తాత మధు పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్.**

నందిగామ:సెప్టెంబర్ 08(విజన్ ఆంధ్ర న్యూస్): ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాత మధు,నాగరకుంటా నవీన్ కుమార్ రెడ్డి లు చేసిన అసభ్యకరమైన, అవమానకరమైన వ్యాఖ్యలపై శాసన మండలి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని,

ఎమ్మెల్సీ తాత మధు పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని నందిగామ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దేపల్లి కుమారస్వామి గౌడ్ డిమాండ్ చేశారు.తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాత మధు,నాగరకుంటా నవీన్ కుమార్ రెడ్డి లు చేసిన అసభ్యకరమైన, అవమానకరమైన వ్యాఖ్యలను తీవ్రంగా కండిస్తూ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం నందిగామ మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయ



ఆవరణలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నందిగామ మండల అధ్యక్షుడు దేపల్లి కుమారస్వామి గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీలు తాత మధు, నాగరకుంటా నవీన్ కుమార్ రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు.ఈ సందర్భంగా దేపల్లి కుమారస్వామి గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీలు తాతా మధు,నాగరకుంటా నవీన్ కుమార్ రెడ్డి లు దూషించడం సరికాదని,స్పీకర్‌ను అవమానించినందుకు ఎమ్మెల్సీ తాతా మధు, నాగరకుంటా నవీన్ కుమార్ రెడ్డిలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.రాజకీయ విమర్శలు హద్దులు దాటరాదని,కానీ వ్యక్తి గత దూషణలకు దిగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు.రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్ ను అవమానించేలా మాట్లాడటం అత్యంత బాధ్యతారాహిత్యమైన చర్య అన్నారు.

అసెంబ్లీ సమావేశానికి నల్ల చొక్కాలు వేసుకొని వచ్చి బజార్లో బట్టలు చింపుకొని,చిల్లర వేషాలు వేయడం ఆ పార్టీ ఎమ్మెల్యే,ఎమ్మెల్సీల దిగజారుడు తనానికి నిదర్శనం అన్నారు. అత్యున్నత పదవిలో ఉన్న దళిత స్పీకర్ పై వ్యాఖ్యలు చెయ్యడాన్ని తీవ్రంగా ఖండించారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని,ఎమ్మెల్సీ తాత మధు,నవీన్ రెడ్డిలను శాసన మండలి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ నాయకులు వెంటనే దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని అన్నారు.కేసీఆర్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే తన పార్టీ ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యలను ఖండించి,స్పీకర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ,మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్,పిఏసీఎస్ చైర్మన్ లు పసుల బుచ్చయ్య,కుందారపు వెంకట్ రెడ్డి,గ్రామ కమిటీ అధ్యక్షుడు కేశమోని రామచందర్,షాద్ నగర్ ఏఎంసి డైరెక్టర్ చాకలి నర్సింహా,మండల పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచులు గొర్లపల్లి అశోక్,మల్లేష్,వార్డు సభ్యులు,బొమ్మగళ్ల నర్సింహ,కిట్టు,లింగం, నాయకులు జంగ జంగా నర్సింహ,చంద్రపాల్ రెడ్డి,ఆకుల జ్ఞానేశ్వర్,కావాలి కృష్ణ,ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు శ్రీను నాయక్,నాయకులు బంట్రుపు జంగయ్య గౌడ్,సుఖ్య నాయక్,వేణు, వెంకట చారి,రాఘవేందర్ గౌడ్,సోమ్లా నాయక్, గుండాల వేణుగోపాల్,జంగా రమేష్,గుండాల అనిల్ కుమార్,చించేటి కృష్ణ,పిట్టల రాములు, తడకల జంగయ్య,బాలరాజ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

బోధన్, సెప్టెంబర్08 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మంగళవారం బోధన్ పట్టణంలోని 29వ వార్డు బీజేపీ కౌన్సిలర్ రాజులదేవి పూజిత ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఇంటి వద్ద భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన పూజ కార్యక్రమానికి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి విచ్చేసి అర్హత పొందిన లబ్ధిదారులకు ఇంటి పట్టాను అందజేశారు. సొంతింటి కలను సాకారం చేసుకునే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పాషా మోయినుద్దీన్, బీజేపీ నాయకులు పవన్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ బి ఎల్ ఓ లకు శిక్షణ సదస్సు

సదాశివపేట : విజన్ ఆంధ్ర : సదాశివపేట మున్సిపల్ కార్యాలయంలో సోమవారం తహసిల్దార్ హరిచంద్ర ప్రసాద్ బి ఎల్ ఓ లకు శిక్షణ సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది.
ఈ సందర్భంగా తహసిల్దార్ హరిచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు జారీ చేసినచో డాక్యుమెంట్స్ అప్లోడింగ్ ప్రక్రియలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలపై బిఎల్ఓ లకు క్షుణ్ణంగా వివరించారు. ప్రజలకు సర్ నోటీసులు వచ్చినా కూడా ఎటువంటి భయభ్రాంతులకు గురి కావద్దని ప్రజలకు వివరించాలన్నారు.
ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ కిరణ్, ఆరిఫ్, ఆర్ ఐ లు సాయి, మంజులత, మున్సిపల్ డబ్ల్యూ ఓ స్వామి, ట్రైనర్ మల్లేశం, బి ఎల్ వో లు తదితరులు పాల్గొన్నారు.

## విట్టొలిలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ముథోల్, సెప్టెంబర్08:విజన్ ఆంధ్ర : ముథోల్ :మండలంలోని విట్టొలి గ్రామ పంచాయతీలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కాలేవర్ రుచిత దిగంబర్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సులభతరంగా మార్చేందుకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తోందన్నారు. వీటి ద్వారా రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియ మరింత వేగంగా, సులభంగా జరిగే అవకాశం ఉందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వం అందిస్తున్న రేషన్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివరాజ్, పంచాయతీ కార్యదర్శి రాజు, రేషన్ డీలర్ మల్లేష్, నాయకులు నగేష్, నారాయణ రెడ్డి, లబ్ధిదారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# పీజీ సీటు కోసం వెబ్ ఆప్షన్లు పెట్టుకోండి

### 8 నుంచి 10 వరకు అవకాశం.. 14న సీట్ల కేటాయింపు..

బెల్లంపల్లి, సెప్టెంబరు 8 విజన్ ఆంధ్ర బెల్లంపల్లి ప్రభుత్వ పీజీ కళాశాలలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్ సూచించారు. ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎంఏ ఇంగ్లీష్, ఎంకాం కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.
8 నుంచి 10 వరకు వెబ్ ఆప్షన్లు
2026--27 విద్యా సంవత్సరానికి పీజీలో ప్రవేశం కోసం టీజీ సీపీగెట్--2026లో ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు, పరీక్షలో ఉత్తీర్ణులు కాకపోయిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇప్పటికే ప్రవేశాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించారు.
మొదటి ప్రాధాన్యంగా కళాశాలను ఎంచుకోవాలి



విద్యార్థులు వెబ్ ఆప్షన్లలో బెల్లంపల్లి ప్రభుత్వ పీజీ కళాశాలను మొదటి ప్రాధాన్యంగా ఎంపిక చేసుకోవాలని డాక్టర్ కాంపల్లి శంకర్ కోరారు. ఈ నెల 14న సీట్ల కేటాయింపు ప్రక్రియ ఉంటుందని వెల్లడించారు. రెండేళ్ల క్రితం ప్రారంభమైన పీజీ సెంటర్ విజయవంతంగా కొనసాగుతోందని, స్థానికంగానే ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం లభిస్తున్నందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మరిన్ని వివరాల కోసం 9959269975 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# రూ.3.45 కోట్లతో బాక్స్ డ్రెయిన్ పనులు

### సాయిరాంనగర్‌లో పనులను పరిశీలించిన మాజీ మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్,సెప్టెంబర్ 08(విజన్ ఆంధ్ర ప్రతినిధి): బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని సాయిరాంనగర్ కాలనీలో రూ.3.45 కోట్లతో చేపడుతున్న బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులను మంగళవారం బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్,కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెయిన్ నిర్మాణంతో కాలనీలో మురుగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బి-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,
బోడుప్పల్ మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు పి.నర్సింహారెడ్డి,11వ డివిజన్



కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్ కుమార్,మాజీ కార్పొరేటర్ భూక్య సుమన్ నాయక్,కాంగ్రెస్ నాయకులు తోటకూర శ్రీశైలం యాదవ్,గుర్రాల వెంకటేష్ యాదవ్, చిప్పల శ్రీనివాస్,కాలనీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, కాలనీ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో గుగ్గిళ్ల వింజపల్లి కాజ్‌వేకు

# రూ.1.75 కోట్ల నిధులు మంజూరు

### తీరనున్న వాహనదారుల కష్టాలు.. రాకపోకలకు మరింత సౌలభ్యం

### కాజ్‌వే మంజూరుపై హర్షం వ్యక్తం చేసిన హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 8: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా మంత్రి పొన్నం ప్రభాకర్ చేస్తున్న నిరంతర కృషికి మరో ఫలితం లభించింది. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ల-- హుస్నాబాద్ నియోజకవర్గం లోనీ వింజపల్లి రహదారిపై కాజ్‌వే నిర్మాణానికి రూ.1.75 కోట్ల నిధులు మంజూరయ్యాయి.ఈ మేరకు పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ (రోడ్లు) ద్వారా పరిపాలనా అనుమతులు జారీ చేసింది. సిఆర్ఆర్ (ప్లాన్) 2026-27 గ్రాంట్ కింద ఈ నిధులను మంజూరు చేశారు.ఈ సందర్భంగా గుగ్గిళ్ల - వింజపల్లి మధ్య రాకపోకలకు కాజ్‌వే నిర్మాణం ఎంతోకాలంగా ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నారు.ముఖ్యంగా వర్షాకాలంలో వాహనదారులు, గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగనున్నాయి. కాజ్‌వే నిర్మాణంతో రెండు గ్రామాల మధ్య రవాణా మరింత సులభతరం కానుంది.నియోజకవర్గ ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ కి గుగ్గిళ్ల, వింజపల్లి గ్రామాల ప్రజలు, వాహనదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ హుస్నాబాద్ నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేస్తున్నారని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# గురు వందనం ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

మర్కుక్ సెప్టెంబర్ 08,(విజన్ ఆంధ్ర ) : లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 డి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని మంగళవారం నాడు రవీంద్రభారతి లో నిర్వహించారు.గురు వందనం లో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మర్కూక్ తెలుగు ఉపాధ్యాయురాలు డాక్టర్.లావణ్య,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాములపర్తి జీవశాస్త్ర ఉపాధ్యాయులు వి.శ్రీనివాస్ రెడ్డి,ప్రాథమికోన్నత పాఠశాల ఎర్రవల్లి ఉపాధ్యాయులు ఏ.కనకరావు లు ఉత్తమ ఉపాధ్యాయుగా ఎంపికైన సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు.వీరికి పిఆర్టియు మర్కుక్ మండల పక్షాన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియూ మర్కుక్ మండల అధ్యక్షులు ఎన్.రామకృష్ణారెడ్డి,ప్రధాన కార్యదర్శి తుమ్మ కుమార్,ఉపాధ్యాయులు వెంకటేశం తదితరులు ఉన్నారు.



## మాస్ కమ్యూనికేషన్‌లో ప్రాన్నుతకు రెండు స్వర్ణ పతకాలు

### చదువులో వరుస విజయాలు..

### ఓయూలో ప్రతిభకు స్వర్ణ కిరీటం

ఓయూ,సెప్టెంబర్ 08(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : ఉస్మానియా విశ్వవిద్యాలయం మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగంలో దాసి ప్రాన్నుత రెండు స్వర్ణ పతకాలు సాధించారు.తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి జిల్లా కూనారం గ్రామానికి చెందిన ఆమె ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో జన్మించారు. బెంగళూరు,వరంగల్ కేంద్రీయ విద్యాలయాల్లో విద్యాభ్యాసం చేశారు. పదో తరగతి, ఇంటర్‌లో టాపర్‌గా నిలిచారు.
డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మరాఠ్వాడా విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేషన్‌లోనూ ప్రతిభ కనబరిచిన ప్రాన్నుత.. అనంతరం ఓయూలో మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజంలో పీజీ పూర్తి చేశారు. ఈ సందర్భంగా రెండు స్వర్ణ పతకాలు సాధించారు.ప్రాన్నుత మాజీ భారత వైమానిక దళ అధికారి దాసి ప్రభాకర్, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కల్పన దంపతుల కుమార్తె. ప్రభాకర్ వాయుసేనలో సేవలందించడంతో పాటు కార్గిల్ యుద్ధంలో పాల్గొని, దేశ సేవకు గుర్తింపుగా పతకం అందుకున్నారు. కుమార్తె రెండు స్వర్ణ పతకాలు సాధించడం గర్వకారణమని తల్లిదండ్రులు పేర్కొన్నారు.

## ఘనంగా నర్మెట్టలో ఎల్లమ్మ బోనాల పండుగ

### గౌడ సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

నంగునూరు మండలం సెప్టెంబర్ 8 విజన్న ఆంధ్ర నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో శ్రావణమాసం సందర్భంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి, బోనాలను అలంకరించి ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పించారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. బోనాల సందర్భంగా గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది.
ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు, యాదగిరి గౌడ్,చంద్రశేఖర్ గౌడ్ ,చంద్రం గౌడ్ ,ఉప్పలయ్య గౌడ్,మహేందర్ గౌడ్ , సత్తయ్య గౌడ్ ,సురేశ్ గౌడ్,శ్రీనివాస్ గౌడ్, రాజు గౌడ్,గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు. పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండించిన ఎమ్మార్పీఎస్

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండించిన ఎమ్మార్పీఎస్

భీమదేవరపల్లి సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర) రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అనుచిత వ్యాఖ్యలు, అసభ్య పదజాలం ఉపయోగించడాన్ని ఎమ్మార్పీఎస్ భీమదేవరపల్లి మండల అధ్యక్షుడు వేల్పుల ప్రశాంత్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ స్పీకర్ పదవికి ప్రత్యేకమైన గౌరవం, హోదా ఉంటాయని పేర్కొన్నారు. స్పీకర్‌పై వ్యక్తిగతంగా, అసభ్యకరమైన పదజాలంతో విమర్శలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ప్రశాంత్ అన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత దూషణలకు పాల్పడటం సరైన పద్ధతి కాదన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్‌కుమార్ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తించాలని సూచించారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలు దళిత సమాజాన్ని కూడా బాధించేలా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు సామాజికంగా ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉందని, నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. తాతా మధుసూదన్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవడంతో



పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు, దళిత సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని వేల్పుల ప్రశాంత్ డిమాండ్ చేశారు. భవిష్యత్తులో రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారిపై అనుచిత వ్యాఖ్యలు చేయకుండా రాజకీయ నాయకులు సంయమనం పాటించాలని ఆయన సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పదవుల గౌరవాన్ని కాపాడటంతో పాటు సామాజిక సామరస్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ప్రశాంత్ పేర్కొన్నారు.

# గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలి

## ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి, సెప్టెంబరు 8 విజన్ ఆంధ్ర : మందమర్రి ఏరియాలోని కాసిపేట--2 ఇంక్లైన్ గనిలో జరిగిన ప్రమాదంపై బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి స్పందించారు. ప్రమాదంలో గాయపడిన కార్మికుల ఆరోగ్య పరిస్థితిపై సింగరేణి అధికారులను ఫోన్‌లో అడిగి తెలుసుకున్నారు.
మిడిల్ షిఫ్ట్‌లో 18 డిస్ట్రిక్ట్, 22 లెవల్ నార్త్ ప్రాంతంలో బ్లాస్టింగ్, అనంతరం మాన్‌హోల్ పనులు చేస్తుండగా పేలుడు సంభవించినట్లు అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ ఘటనలో జి. రమేష్, రాజ్‌కుమార్, క్రాంతికుమార్, పి. శ్రీనివాస్ గాయపడినట్లు తెలిపారు. ప్రస్తుతం గాయపడిన కార్మికులకు శ్రీరాంపూర్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. గాయపడిన కార్మికులకు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు, మెరుగైన చికిత్స అందించాలని ఎమ్మెల్యే అధికారులను సూచించారు. వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, వివరాలను తనకు తెలియజేయాలని ఆదేశించారు. కార్మికుల కుటుంబాలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా పరిశీలించాలని, భద్రతా లోపాలు ఉన్నట్లయితే వెంటనే సరిదిద్దాలని ఎమ్మెల్యే కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా గనుల్లో భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని సింగరేణి అధికారులకు సూచించారు.

# స్పీకర్‌ను అవమానించిన తాతా మధు వెంటనే క్షమాపణ చెప్పాలి

## పదవికి రాజీనామా చేయాలి.. రాజ్యాంగ విలువలను కించపరిచే వ్యాఖ్యలను సహించేది లేదు: ప్రతీక్ వాగ్మారే

ముధోల్ :సెప్టెంబర్ 08:విజన్ ఆంధ్ర. నిర్మల్ జిల్లా: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ను అసభ్య పదజాలంతో అవమానించిన శాసనమండలి సభ్యుడు తాతా మధు తీరును నిర్మల్ జిల్లా విద్యార్థి సంఘం నాయకుడు, యువ దళిత నాయకుడు ప్రతీక్ వాగ్మారే తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్‌ను అవమానించడం ఒక వ్యక్తిని అవమానించడం మాత్రమే కాదని, అది రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని అన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌పై ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలకు స్థానం ఉన్నప్పటికీ వ్యక్తిగత దూషణలకు, అసభ్య పదజాలానికి ఎలాంటి స్థానం ఉండకూడదని స్పష్టం చేశారు. దళితుల గౌరవం, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడే భారత రాష్ట్ర సమితి తమ నాయకుల ప్రవర్తనకు కూడా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఆ పార్టీ అధినేత కె. చంద్రశేఖర్ రావు, పార్టీ నాయకత్వం వెంటనే స్పందించి ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి



తీసుకుని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని, అదేవిధంగా తన పదవికి రాజీనామా చేయాలని ప్రతీక్ వాగ్మారే డిమాండ్ చేశారు. "రాజ్యాంగాన్ని గౌరవించడం అంటే రాజ్యాంగబద్ధమైన పదవులను గౌరవించడం. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను సహించేది లేదు. యువత, విద్యార్థులు, దళితుల హక్కుల కోసం విద్యార్థి సంఘం తరఫున ప్రజాస్వామ్య పద్ధతిలో నిరంతరం పోరాడుతాం" అని ప్రతీక్ వాగ్మారే అన్నారు.

# చికిత్స కోసం రూ.2.50 లక్షల ఎల్‌ఓసి మంజూరు

## అనారోగ్యంతో బాధపడుతున్న మెట్టు సౌజన్యకు మంత్రి శ్రీధర్‌బాబు భరోసా

మల్హర్, సెప్టెంబర్ 8 విజన్ ఆంధ్ర : మంథని నియోజకవర్గం మల్హర్‌రావు మండలంలోని వల్లెంకుంట గ్రామానికి చెందిన మెట్టు సౌజన్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కుటుంబ సభ్యులు కోరగా, మంత్రి చొరవతో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.2,50,000ల ఎల్‌ఓసి మంజూరైంది. మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన ఆస్పత్రి సహాయకులు మంగళవారం రోజున సౌజన్య కుటుంబ సభ్యులకు రూ.2,50,000ల ఎల్‌ఓసి అందజేశారు. తమకు వైద్య సహాయం అందించి అండగా నిలిచిన మంత్రి శ్రీధర్‌బాబుకు సౌజన్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# గణేష్ మండపాల్లో డీజేలు పెడితే చర్యలు తప్పవు..!



**- రాజకీయ పాటలు ప్లే చేస్తే ఊరుకునేది లేదు..**

**- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మండప నిర్వాహకులకు పోలీసుల హెచ్చరిక..**

**- సిఐ సుమన్ కుమార్, ఎస్సై సోమేశ్వరి.**

కొండాపూర్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 8: గణేష్ నవరాత్రి ఉత్సవాల పేరుతో నిబంధనలను ఉల్లంఘిస్తూ హంగామా చేస్తే సహించేది లేదని కొండాపూర్ పోలీసులు తేల్చిచెప్పారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాల్సిందే తప్ప.. డీజేలు, అధిక శబ్దాలతో ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, రాజకీయ పాటలతో వివాదాలకు తెరలేవడం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.కొండాపూర్ మండల పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులతో కొండాపూర్ పోలీస్ స్టేషన్‌లో సీఐ సుమన్ కుమార్, ఎస్సై సోమేశ్వరి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పలు కీలక సూచనలు చేశారు.

డీజేలకు పూర్తిగా నో..

గణేష్ మండపాల వద్ద డీజేలు వినియోగించరాదని పోలీసులు స్పష్టం చేశారు. అధిక శబ్దంతో సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటు చేసి ప్రజలకు, వృద్ధులకు, విద్యార్థులకు, ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాజకీయ పాటలకు చోటు లేదు..!

గణేష్ ఉత్సవాలను రాజకీయ వేదికగా మార్చేందుకు ప్రయత్నించవద్దని పోలీసులు స్పష్టం చేశారు. మండపాల వద్ద రాజకీయ పార్టీలకు సంబంధించిన పాటలు ప్లే చేయడం, రాజకీయ ప్రచారానికి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించడం చేయరాదని నిర్వాహకులకు తేల్చి చెప్పారు.

భక్తి పేరుతో హద్దులు మీరితే కఠిన చర్యలు

ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలవాలని.. ఎలాంటి గొడవలు, వివాదాలు, అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు. మండపాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే పరిస్థితిని బట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గణేష్ ఉత్సవాలు విజయవంతంగా, ప్రశాంతంగా జరగాలంటే మండప నిర్వాహకులు పోలీసులకు పూర్తిగా సహకరించాలని సీఐ సుమన్ కుమార్, ఎస్సై సోమేశ్వరి కోరారు.

# దళిత బహుజనవాది, సీనియర్ జర్నలిస్ట్ గైని విఠల్‌కు పట్టం..

**ఏకగ్రీవంగా TUWJ డివిజన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నిక!**

**- అంబేద్కర్ భవన్‌లో ఘన సన్మానం**

**- అణగారిన వర్గాల గళానికి దక్కిన గౌరవం: నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ రహీం**



నారాయణఖేడ్ సెప్టెంబర్ 8 (విజన్ ఆంధ్ర): నారాయణఖేడ్ డివిజన్ జర్నలిజం రంగంలో విప్లవాత్మక మార్పుకు నాంది పడింది. నిరంతరం ప్రజాపక్షం వహిస్తూ, సమాజంలో అణగారిన, శ్రామిక వర్గాల గళాన్ని బలంగా వినిపిస్తున్న ప్రముఖ దళిత బహుజనవాది, సీనియర్ జర్నలిస్ట్ గైని విఠల్ నారాయణఖేడ్ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఖజెజ్ – xఖ) డివిజన్ నూతన ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అంబేద్కర్ భవన్‌లో జరిగిన ఈ ఎన్నిక సామాజిక శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది.

పీడిత వర్గాల ఆశాజ్యోతి గైని విఠల్: రహీం

గైని విఠల్ ఎన్నిక బహుజన సమాజానికి గర్వకారణమని కొనియాడుతూ నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ రాష్ట్ర బృందం ఆయనను ఘనంగా సత్కరించింది. కమిషన్ రాష్ట్ర చైర్మన్ రహీం, రాష్ట్ర వైస్ చైర్మన్ గైని సాయిలులు స్వయంగా తరలివచ్చి విఠల్‌కు శాలువా కప్పి, పూలమాలలతో ముంచెత్తారు. అనంతరం ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ దళిత బహుజన జయధ్వానాల మధ్య సంబరాలు జరుపుకున్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర చైర్మన్ రహీం ఉద్వేగభరితంగా మాట్లాడుతూ.. "గైని విఠల్ కేవలం ఒక జర్నలిస్ట్ మాత్రమే కాదు, సమాజంలో వివక్షకు, అణచివేతకు గురవుతున్న దళిత, బహుజన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడే గట్టి సామాజిక వాది. నిబద్ధత గల ఇలాంటి నాయకుడికి ఈ పదవి దక్కడం వల్ల జర్నలిజం రంగానికే వన్నె తెచ్చింది. రాబోయే రోజుల్లో ఆయన నేతృత్వంలో శ్రామిక జర్నలిస్టుల సమస్యలతో పాటు, వెనుకబడిన వర్గాల సామాజిక హక్కుల రక్షణకు బలమైన పునాది పడుతుంది" అని స్పష్టం చేశారు.

తరలివచ్చిన సామాజిక విప్లవ శ్రేణులు:

ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో అంబేద్కర్ భవన్ ఇన్‌చార్జ్ భీమాసేన, నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ డివిజన్ ప్రెసిడెంట్ ఎస్. నర్సింలు, వైస్ ప్రెసిడెంట్ శివానంద, రజక సంఘం రాష్ట్ర అగ్రనేత ప్రశాంత్, మరియు సీనియర్ నాయకులు శంకర్ నాగల్గిద్ద తదితర సామాజిక, రాజకీయ రంగాల ప్రముఖులు పాల్గొని గైని విఠల్‌కు విప్లవాత్మక అభినందనలు తెలియజేశారు.

# ఎమ్మెల్సీ మధు సభ్యత్వాన్ని రద్దు చేయాలి

**- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి డిమాండ్**



గజ్వేల్, 08 సెప్టెంబర్ 2026 (విజన్ ఆంధ్ర) : పోలీసులపై దాడులు చేస్తూ, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారిని అవమానించడమే బిఆర్ఎస్ నైజమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం ఎర్రవల్లి గ్రామ శివారులో జరిగిన తొక్కిసలాటలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీ వద్ద బిఆర్ఎస్ నేతల ప్రవర్తన ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని ధ్వజమెత్తారు. బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలతోనే ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను అసెంబ్లీ సాక్షిగా దూషించారని ఆరోపించారు. స్పీకర్‌ను అవమానించడం ద్వారా దళిత సమాజాన్ని కించపరిచారని, దీనికి బాధ్యత వహిస్తూ కేసీఆర్ దళిత సమాజానికి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు శాసనమండలి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. మహిళా పోలీసుల ముందే బిఆర్ఎస్ నాయకులు చొక్కాలు విప్పి ప్రదర్శించడం వారి దిగజారుడు సంస్కృతికి అద్దం పడుతోందని ఎద్దేవా చేశారు. తమ తప్పును తెలుసుకోకుండా కాంగ్రెస్ శ్రేణులను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్న బిఆర్ఎస్ తీరును నిరసిస్తూ ఎర్రవల్లి ఫామ్‌హౌజ్ వద్ద దప్పు మోతలతో నిరసన తెలపడం జరిగిందన్నారు. కేసీఆర్ ఇప్పటికైనా ఫామ్‌హౌజ్ నుంచి బయటకు వచ్చి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలన్నారు.

# గణేష్ ఉత్సవాల్లో నిబంధనలు తప్పనిసరి

**- అనుమతులు తీసుకుని మండపాలు ఏర్పాటు చేసుకోవాలి**

**-డీజేలకు అనుమతి లేదు.. సీఐ అంజమ్మ**

నార్నూర్, సెప్టెంబర్ 08(విజన్ ఆంధ్ర ):గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించుకోవాలని నార్నూర్ సీఐ అంజమ్మ సూచించారు. మంగళవారం మండలంలోని రాజులగూడ సుమన్‌బాయి ఫంక్షన్‌హాల్‌లో గణేష్ ఉత్సవాల నిర్వహణపై శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్, ఇతర సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు తీసుకున్న తర్వాతే మండపాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. మండపాల వద్ద విద్యుత్ సౌకర్యం, భద్రతా ఏర్పాట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉత్సవాల నిర్వహణలో ఇతరులకు ఇబ్బందులు కలగకుండా నిబంధనలు పాటించాలన్నారు.

డీజేలకు అనుమతి లేదు

గణేష్ ఉత్సవాల సందర్భంగా డీజేలకు ఎలాంటి అనుమతి లేదని సీఐ అంజమ్మ స్పష్టం చేశారు. అధిక శబ్దంతో సౌండ్ సిస్టమ్స్ వినియోగించి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాలను పోలీసుల సూచనలకు అనుగుణంగా నిర్వహించుకోవాలని కోరారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.మండపాల వద్ద ఎలాంటి గొడవలు, వివాదాలకు తావులేకుండా కమిటీ సభ్యులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గణేష్ ఉత్సవాలను ప్రజలందరి సహకారంతో భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించుకోవాలని సీఐ అంజమ్మ కోరారు.సమావేశంలో ఎస్ఐ శ్రీ సాయి, పోలీసు సిబ్బంది, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,వివిధ గ్రామాల నిర్వాహకులు పాల్గొన్నారు.